# మిసిమి

మాస పత్రిక

డిసెంబర్ - 2005



రూ.8/-



సింబాలిజమ్‌కు చెందిన కవిగా ప్రసిద్ధిగాంచిన రాబర్ట్ మోంటిస్కె చిత్రమిది. చిత్రకారుడు జివోనీ బోల్డినీ.
అంతకు పూర్వపు సంప్రదాయానికి భిన్నమైన భంగిమలో ఈ చిత్రాన్ని చిత్రించాడు.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 16 డిసెంబర్ 2005 సంచిక 12

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయ సూచిక

వాదప్రియ భారతీయుడు — అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఆత్మోన్నతికి సత్యమే ఆధారం — మూలం: దత్తాత్రేయ రామచంద్ర బేంద్రే
అనువాదం డా॥ జె. లక్ష్మిరెడ్డి

హృదయం — వింజనంపాటి రాఘవరావు

మహాభారతం - ఒక మానవతా రూప చిత్రం — మూలం : జువాన్ మిగ్యూల్‌మోరా
అనువాదం : బి.వి. రామిరెడ్డి

కనువిందు చేసే నవీన ఉషోదయం - ఆర్ట్‌నోవో — కాండ్రేగుల నాగేశ్వరరావు

తెలుగు వేమన వెలుగులోకి ఎలా వచ్చాడు? — కె. జితేంద్రబాబు

జన్యువు — జూకంటి జగన్నాథం

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

***ముఖచిత్రం :*** ఆర్ట్‌నోవో కళారూపం

***చిత్రకారుడు :*** లూయిస్ అచ్చేమా

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# వాదప్రియ భారతీయుడు
# (The Argumentative Indian)

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ రాసిన పాండితీ ప్రకర్షతో గూడిన పదహారు వ్యాసాల సంకలనం వాదప్రియ భారతీయుడు (The Argumentative Indian) అనే పేరుతో వెలువడింది. ఇక్కడ వాదప్రియుడు అంటే ఎప్పుడూ తగవును కోరుకొనేవాడు అని అర్థం చేసుకోరాదు. వాదం అంటే హేతుబద్ధంగా, తార్కికంగా, ఉపపత్తితో, ప్రమాణాలతో శాస్త్రీయంగా చర్చించడం అని అర్థం చేసుకోవాలి.

శాస్త్రీయాలోచనా శీలానికి చర్చ, వాదం (తార్కిక), విశ్లేషణలు ఆయువుపట్టులు. అందుకని ఒక అభిప్రాయం సంప్రదాయ విరుద్ధమైనదైనా అది ఎక్కడి నుండి వచ్చినా దానిని పరిశీలించాలి. ఈ పరిశీలనలో సమదృష్టి అంటే బౌద్ధంలో చెప్పే ఉపేక్ష (ఉపేక్ష అంటే అసలు పట్టించుకోక పోవడం కాదు) - సమత, ప్రజాస్వామ్యంలు ఉండాలి. అంటే శాస్త్రీయాలోచనాశీలతను ఈ రెండు పదబంధాలలో వ్యక్తీకరించవచ్చు. 1) అంతరంగ బహుళవాద (Internal pluralism), 2) బాహ్య గ్రాహక శీలత(External receptivity)-అంటే శాస్త్రీయాలోచనా శీలానికి ముఖ్యంగా బహిరంగత ఉండాలి. బుర్రకు తాళం వేసుకోరాదు. అంతరంగం విశాలమై ఉండి బయటి నుంచి ఏ భావాలు వచ్చినా వాటిని లోనికి అనుమతించి, అనుభవం గీటురాయిపై, నిష్పక్షపాతంగా, ముందుగా ఏర్పరుచుకొన్న అభిప్రాయాలతో కాక, బేరీజువేయాలి.

భారత దేశ ప్రప్రథమ ప్రధానమంత్రి భారతీయులంతా శాస్త్రీయాలోచనాశీలాన్ని అలవరుచుకోవాలన్నాడు. ఇక్కడ నెహ్రూ ఉద్దేశం ఏమిటంటే, ఒక నిర్ణయం చేయడానికి తర్కనిష్టతో, హేతుబద్ధతతో, పూర్వనిశ్చితాభిప్రాయాలను విడనాడి, పక్షపాత సంకుచిత ధోరణులను విడనాడి, ఆలోచించాలని. ముఖ్యంగా ఒక జాతికి, ఒక సమాజానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకొనేటప్పుడు పైన చెప్పిన శాస్త్రీయాలోచన చాలా అవసరం అన్నాడు. పుస్తకం పేరు పాఠకునికి పుస్తకంలో లేని అభిప్రాయాన్నే కలిగించేట్టుగా ఉంది. వాద ప్రియుడు అంటే కలహ భోజనుడనిపిస్తుంది. భారతీయులెప్పుడూ వాదాలు, వివాదాలు, విసంవాదాలు చేసే శుష్క తార్కికులు, పసలేని మాటకారులు అనే అభిప్రాయం కల్గిస్తుంది. కాని సేన్ ఉద్దేశం అది కాదు, కాని మనలను ఉడికించడానికే ఆ పేరు పెట్టాడు. కాని వాస్తవానికి ఈ గ్రంథం వేలాది సంవత్సరాల భారతీయ చింతన ముఖ్య లక్షణం 'శాస్త్రీయం' అంటుంది.

వేదకాలం నాటి చింతనలో శాస్త్రీయత ఉందని అనలేము కాని, ఉపనిషత్తులు, మహాభారతకాలం నాటి నుంచి, భారతీయ చింతనలో మనకు వాదాలు, విసంవాదాలు, ప్రశ్నలు, చర్చలు, సంవాదాలు కనిపిస్తూనే ఉన్నాయని అంటుంది ఈ గ్రంథం.

ఆంతరంగిక బహుళవాదం అంటే సేన్ ఉద్దేశంలో అందరికీ, అన్ని వాదాలకు, సిద్ధాంతాలకు, ఛాయలకు చోటు కల్పించడం. మానవులందరికి - మగ, ఆడ, దొంగ, దొర, పాత, కొత్త, వృద్ధ, యువక అందరికీ చోటు కల్పించడం. దీనికి ఉదాహరణగా ఆయన భారతీయ చింతనలో స్త్రీకి చోటు కల్పించడాన్ని చెబుతాడు. గార్గి, యాజ్ఞవల్క్యముని భార్య మైత్రేయిలు తత్వచర్చలో పాల్గొనడాన్ని బృహదారణ్యకోపనిషత్తు పేర్కొనడాన్ని ఉటంకిస్తాడు. యుద్ధానికి సమకట్టాలా వద్దా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్న యుధిష్టరునికి యుద్ధానికి సమాయత్తం కమ్మని ద్రౌపది పురికొల్పడాన్ని ఉదహరిస్తాడు. ఈ విధంగా భారతీయ చింతన లింగ భేదాన్ని అధిగమిస్తే, వర్ణ, వర్గ, బేధాలను ఎలా అధిగమించిందో, భారద్వాజ రుషిని ఉటంకించి ఇలా చెప్పాడు: " వేరువేరు రంగులు వేరు వేరు కులాలను చెబితే, అన్ని కులాలు సమ్మిశ్ర కులాలవుతాయి. నాలుగు కులాల (వర్ణాల) వారు దేవుని బిడ్డలే కనుక అందరూ అదే కులానికి చెందుతారు. ఒకే తండ్రికి పుట్టిన

పిల్లలు వేరు వేరు కులాలకు చెందిన వారు ఎలా అవుతారు?" ఈ విషయాన్నే ఇటీవలన జనన పదార్థ అధ్యయనాలు (genome studies) రుజువు చేశాయిగదా అంటాడు సేన్.

ఆంతరంగిక బాహుళ్యతే కాక, బాహ్యగ్రాహకత గూడా భారతీయ చింతనలో ఉందనడానికి మహావైయ్యాకారిణి పాణినియే సాక్ష్యం. పాణిని ఆఫ్ఘనిస్థాన్ దేశస్తుడు. ఈ రకమైన మన సంప్రదాయం మన జీవన విధానాన్ని సంస్కృతిని మలచిందంటాడు సేన్.

ఇక్కడ లౌకిక వాద ప్రస్తావన గూడ ముఖ్యమే. ఎన్నో శతాబ్దాలు బౌద్ధం-హిందూ (బ్రాహ్మణ) మతం కాదు-భారతదేశంలో అతి ముఖ్యమైన మతం. ముఖ్యంగా తొలి బౌద్ధం, అభిప్రాయ భేదాల పరిష్కారానికి ఏర్పాటు చేసిన బహిరంగ చర్చావేదికలు, సంగీతుల (రాజగృహ, వైశాలి, పాటలీపుత్ర)ను మనం పరిగణలోకి తీసుకోవాలి.

భారత దేశం లౌకికం అనడానికి, మన దేశంలో అన్ని మతాలవారు -ముస్లిమ్‌లు, సిక్కులు, యూదులు, పారశీలు, క్రైస్తవులు, జైనులు- ఎవరి ప్రత్యేకతను వారు కాపాడుకొంటూనే ఉన్నారు. అంతే కాదు మన దేశంలో అనేక పంచాంగాలు నేటికీ అమలులో ఉన్నాయి.

విలువలు-హేతువాద, ఉదారవాద విశ్లేషణాత్మక పరీక్షణం, బహిరంగ చర్చ, రాజకీయ సహనత, ఐక్యత, హక్కులు, న్యాయం ఇంకా విజ్ఞానశాస్త్రం-పాశ్చాత్యులు తెచ్చి, వలస రాజ్యమైన మన దేశానికి అందించినవి కావు. ఇవన్నీ అశోకుడు, తిరువళ్ళువర్, ఆర్యభట్టు, బ్రహ్మగుప్త, మాధవాచార్య, నానక్, కబీర్, అక్బర్, గాంధీ, టాగోర్, నెహ్రూ - కాలాలలో మన బహుళ సంప్రదాయ సంస్కృతిలో ఉన్నవే. ఉదాహరణకు అక్బర్ తన హేతువాద పథంలో (రహి అఖ్‌ల్) సంప్రదాయాన్ని కాదని, హేతువును అనుసరించడం కేవలం వాదాన్ని కొనసాగించడం కాదు- అనే విషయాన్ని నొక్కి చెబుతుంది.

ఇటువంటి వాద ప్రియ సంస్కృతి స్ఫూర్తిని మనం పొదలదాల్చాలి, రక్షించుకోవాలి అంటాడు సేన్. ఇదే స్ఫూర్తిని మనం అలవరుచుకోవాలని నెహ్రూ "శాస్త్రీయ శీలం" (Scientific temper) గురించి చెప్పడంలో అంతర్గర్భంగా ఉంది.

**నా విమర్శన:** మన సంస్కృతి, సంప్రదాయాలు చాలవరకు వాద ప్రియాలే అయినా, పైచెప్పిన లక్షణాలన్నీ అందులో ఉన్నా, ఈ భారతీయ సంస్కృతి కొందరి సంస్కృతే కాని అందరి సంస్కృతి కాదు. సేన్ ఎన్నుకొన్న ఉదాహరణలతో మనం భారతీయ సంస్కృతి అని చెప్పబడుతున్న దానిని సమర్థించలేం. ఉదాహరణకు గార్గి, మైత్రేయిలు అనే ఇద్దరు స్త్రీలు భారతీయ మహిళా లోకం మొత్తానికి ప్రతీకలు కాదు. మామూలు సగటు భారతీయ మహిళ వాస్తవ స్థితి గతులు నాడెలా ఉన్నాయి? గార్గి, మైత్రేయిల స్థితిగతులులా ఉన్నాయా?

అలాగే వర్ణాలన్నీ సమానమే -అందరూ దేవుని బిడ్డలే గనుక-అన్నది గూడ నిలవదు. అందరూ సమానమే కాని-బ్రాహ్మణ వర్గం మరీ సమానం-అన్నది నాటి సంస్కృతి.

అది బ్రాహ్మణ సంస్కృతి-వేద, బ్రాహ్మణ, ఉపనిషత్ సంస్కృతి. సంస్కృతంలో పొదిగిన విలువలే భారతీయ సంస్కృతికి ప్రామాణికం. దీనిని "మహా సంప్రదాయం" (great- tradition) అంటారు. మరి మిగతా జానపద సంస్కృతి (little tradition), హీన, అధో వర్గాల సంస్కృతి, మహా సంప్రదాయంలో భాగాలు కాలేకపోయాయి.

మహా సంప్రదాయాన్నే సేన్ భారతీయ మొత్తం సంప్రదాయానికి ప్రతీకగా గ్రహించాడు. ఈ మహా సంస్కృతిని భారతీయ పాక్షిక సంస్కృతిగా పరిగణిస్తే, లింగభేదాలను, వర్ణ (కుల) భేదాలను అధిగమించడం భారతీయ సగటు మానవుని జీవితంలో జరగలేదని విషయనిష్ఠతో చరిత్రాధ్యయనం చేసిన వారికెవరికైనా తట్టే విషయం. మరి ఇలాంటి మహా సంప్రదాయంలో ఆంతరంగిక బాహుళ్యానికి చోటెక్కడ? సేన్ ఇది విస్మరించాడు.

*(ది హిందూ 22-09-2005 సౌజన్యంతో)*



# ఆత్మోన్నతికి సత్యమే ఆధారం

1973వ సం॥ జ్ఞానపీఠ్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు
(కన్నడం నుండి హిందీలోకి అనువదింపబడిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)



దత్తాత్రేయ రామచంద్ర బేంద్రే
(1896-1983)

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి

ఒక విశిష్టమైన యోగ్యత లేక గుణానికి గుర్తింపు లభించినప్పుడు ప్రజల్లో ఒక వర్గం వివాదం రేకెత్తించడంకాని, ఏదైనా నేరారోపణ చేయడంగాని జరుగుతూ ఉంటుంది. అప్పుడు నేరస్తుడుగా భావించబడిన వ్యక్తి ఆత్మకు నాశం లేదని గుర్తు చేసి ఊరుకోవలసి వస్తుంది. ఇప్పుడు నేను అలాంటి మాట ఏదీ చెప్పదలచుకోవడంలేదు. ఏ హృదయము, ఏ ఆత్మ సత్యాన్వానికి స్వాగతం పలుకుతుందో, అది శాశ్వతమైంది, అని మాత్రమే చెప్పదలచుకున్నాను.

నేను కన్నడ భాషలో కవిశ్రేష్ఠులుగా భావించబడే పంప, కుమార వ్యాసుల జన్మభూమి అయిన ధార్వాడ్‌కు చెందినవాణ్ణి. దేశంలోని ఏ భూభాగంలో అయితే మొదటి మోక్షగామి అయిన బాహుబలి గొమ్మట్ విగ్రహాలు ఒకటి తర్వాత ఒకటి చెక్కబడ్డాయో, ఆ భూభాగంలో జన్మించాను. కర్నాటకలోని ఈ ధార్వాడ్ ప్రాంత ప్రశస్తిని ఆండయ్య తన ఒక రచనలో కీర్తించాడు. అది పురాణగాథ కావచ్చు లేక పూర్తిగా కల్పిత కథ కూడా కావచ్చు. ఈ రచనకు 'కబ్బిగర్ కావ్' (కవుల సంరక్షకుడు) అనే పేరు పెట్టబడింది.

ఇందులో వర్ణింపబడిన రతి, కామదేవుల వియోగ సంయోగాల విరోధాభాసతో కూడిన లీలలు, అంటే నరకాన్ని స్వర్గంగాను, స్వర్గాన్ని నరకంగాను మార్చే లీలలు ఇంతవరకు పూర్తిగా అర్థంచేసుకోబడలేదు. అక్కడ మాయ, ఇంద్రజాలం, వీటికున్న తార్కిక తారతమ్యాలను గురించిన సమస్య ఎదురవుతుంది. కాని, నిజానికి అక్కడున్న సమస్య సంగీత లయల ఐక్యతకు సంబంధించింది.

'నాకుతంతి' (నాలుగు తీగలు) నా 19వ కవితా సంపుటి. 6 సంపుటాలు ఆ తర్వాత కూడా వెలువడ్డాయి. వాటిలో రెండు మునుపటి సంపుటాలలో నుండి ఎంపిక చేసిన రచనల సంపుటాలు. భాగ్యమో, యాదృచ్ఛికమోగాని ఈ 'నాకుతంతి'కే జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపిక అయే గౌరవం దక్కింది. ఈ పురస్కారంలో ఒరిస్సాకు చెందిన రచయిత, నా మిత్రుడు కూడా సహభాగిగా ఉంటూ నాకు మరింత ఆనందం కలిగిస్తున్నాడు. దీన్ని నా సౌభాగ్యంగా భావిస్తున్నాను. ఇలా మొదటిసారి జరగడంలేదు. మునుపు కర్నాటకకే చెందిన డా॥ కు.వేం. పుట్టప్పకు, గుజరాత్‌కు చెందిన డా॥ ఉమాశంకర్‌జోషికి సంయుక్తంగా ఈ పురస్కారం ఇవ్వడం జరిగింది. ఈ పురస్కారం, ద్వారా సన్మానం పొంది, భారత సరస్వతి పది సంతానాల్లో నా పేరు కూడా చేరింది.

తన మాతృభాషలోకాక ఇతర భాషలో రాసి ఈ పురస్కారం పొందిన మొదటి వ్యక్తిని నేనే ననుకుంటాను. కన్నడ ప్రజలు ఎంతో ఉదారులు. అందువల్లనే ఈ తరుణంలో వారు నాకంటే

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

కూడా ఎక్కువగా సంతోష పడుతున్నారు. నా సంతోషం కూడా రెండు రెట్లు మూడు రెట్లు పెరిగింది. ఢిల్లీలో జరుగుతున్న ఈ ఉత్సవం దాన్ని నాలుగు రెట్లుగా చేసింది.

ఈ 'నాకుతంతి' ఏమిటి? 44 కవితలు ఉన్న ఈ సంపుటలోని మౌలికమైన ప్రశ్నకు 4 అనే అంకెతో సంబంధం లేకుండా ఉండటం అసంభవం. పంప కవికి మునుపు కన్నడ దేశం 'అనంత చతుష్టయ'ను దర్శించడంలో లీనమై ఉండేది. దాన్నే 'సిద్ధపదవి' అనేవారు. మా ప్రాంతంలో విద్యారంభం 'ఓంనమః సిద్ధమ్' మరియు 'శ్రీగణేశాయనమః'తో జరుగుతుంది. కన్నడంలోని చంపూ మహాకావ్యాల ఆరంభం కూడా 'పంచ నమస్కారం'తో చేయబడింది. ప్రతి 24 గంటల తర్వాత మళ్ళీ వచ్చే ఏ ఉషః కాలము మునుపటి దాని పునరావర్తనంకాదు. ప్రేమకమలం శాంతి చతుర్భుజ రూపంలో వికసించినప్పుడే జీవితపు లోతు అవగాహన అవుతుంది. దాని వెలుగు ఒక క్రొత్త సృష్టి రీతిలో ప్రకాశిస్తుంది. ఆ క్రొత్త సృష్టి 'యథాపూర్వం'గా ఉండదు. ఆ క్రొత్త సృజన 'యథా అపూర్వం'గా ఉంటుంది.

'నాకుతంతి'లో ఈ నిత్య నవీనమైన ఉషస్సు యొక్క జన్మోత్సవ సంకీర్తన ఉంది. ఈ సంకీర్తనలో దైవ శక్తి దయావిర్భావాన్ని ప్రకటించే జోలపాట గుణం ఉంది. సృష్టి అంతా ఒక నిష్కామ కర్మ. నిష్కామం కాకపోతే అది కేవలం నిరర్థకశ్రమే అవుతుంది. "నాసతే విద్యతే భావః న అభావో విద్య తే సతః" (సత్యం నశించదు, అసత్యం శాశ్వతంగా నిలబడదు).

మనం వంద సంవత్సరాలు శాంతిని వెలకొల్పగలిగి ప్రేమ, వెలుగుల ఆనందం అనుభవించ గలిగితే, అప్పుడు ఆ యుగాన్ని 200 సంవత్సరాలదాకా పొడిగించగలం. శ్రీ అరవిందులు పుట్టిన సంవత్సరం 1872 మొదలుకొని 2272 వరకు నడిచే చతుశ్శతి ఒక క్రొత్త కృతయుగం, దాని రెండవ చరణం 1972-2072 ఇప్పుడు నడుస్తూ ఉంది. 1973లో నాకు జ్ఞానపీఠ పురస్కారం లభించడం నిజానికి ఆకస్మికమూకాదు, యాదృచ్ఛికమూ కాదు.

అది సృష్టితంత్రం అనంతంతో ఏర్పరచుకున్న సామంజస్యం యొక్క తర్క సమ్మతమైన పరిణామం.

మీరీ విషయాన్ని మనసు పెట్టి వినండని నివేదించుకుంటున్నాను. కర్నాటక ప్రాంతం "సాంఖ్యయోగౌ పృథక్ బాలాః ప్రవదంతిన పండితాః" అనే భగవద్గీతా సూత్రాన్ని స్వీకరించింది. కన్నడ కావ్యం, అది జైన పరంపరకు సంబంధించిందైనా, వీరశైవ పరంపరకు సంబంధించిందైనా, లేక వైదిక పరంపరకు చెందిందైనా ఎల్లప్పుడు సంఖ్యాశాస్త్రంపైన ఆధారపడి నడిచింది. నా నోట్లో నుంచి వచ్చే అస్ఫుట శబ్దాలు కూడా అంకెలుగానే వెలువడుతాయి. అంకెలు అప్రయత్నంగా వస్తాయి కాబట్టి. 'నాకుతంతి'లోని వస్తువు అంకెకాదు. కాని, జీవితంలో నిక్షిప్తమై ఉన్న స్వరైక్యత, సామంజస్యము ఈ అంకె ద్వారానే వ్యక్తమయింది.

"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్"

ఈ మాట ఋషులు చాలా కాలం మునుపే చెప్పారు. వేదమే కావ్యం. 'వాగర్థ సంపృక్తి' 'సాంఖ్యయోగ సంపృక్తి' రెండూ సమానాంతరంగా నడిచి అనంతంలో కలిసిపోతాయి. సమానాంతరత హద్దును తెలిపుతుంది. అనంతం దానివల్ల ప్రభావితంకాదు.

నా మాతృభాష మరాఠీ అయినా, నేను కన్నడంలో రాస్తాను. ఈ రెండింటితో సంస్కృతానికి విరోధం లేదు. ఇక ఇంగ్లీషు గురించి మాట్లాడితే దాన్ని మాత్రం అపవాదుగా ఎందుకు భావించాలి? ఇంగ్లీషులో 26, సంస్కృతంలో 64 అక్షరాలు ఉన్నాయనడంలో సందేహంలేదు. కాని వర్ణ పద్ధతి మాత్రం ప్రపంచమంతా ఉంది కదా. మనం $4^3$ నుండి $4^4$ వైపుకు సాగుతున్నాం. $4^4$ వచ్చి $5^4$తో

కలుసుకున్నప్పుడు ఒక అద్భుతం ఉద్భవిస్తుంది. ధ్యానమగ్నులైన బుద్ధులు దాన్ని సూచించారు. ఆ స్థితి వచ్చినప్పుడు నాలుగవ వేలికొన అయిదవ వేలికొనను తాకుతూ ఉంటుంది.

ఈ రోజు "యజ్ఞం, దానం, తపః కాలము" అన్నీ కలిసిన దుర్లభ సంయోగదినం. లక్ష్మీదేవి సరస్వతీ దేవిని ఈ రోజు అభినందిస్తూ ఉంది. ఈ తరుణానికి మరో విశేషత కూడా ఉంది. ఒకరిని సన్మానించే సందర్భంలో ఇంత మంది విజ్ఞులు గొప్ప సద్భావంతో ఇక్కడ చేరి సంతోషం వెలిబుచ్చడంలోనే ఈ విశేషత ఉంది. నా జీవితంలోని గత 60 ఏళ్ళలో - గత జనవరిలో నాకు 78 ఏళ్ళు నిండాయి - నేను ఎన్నో సన్మానాలను, అభినందనలను పొంది ఉన్నందువల్ల ఇలాంటి ఉత్సవాలలో అతి సహజ భావంతో నేను హాజరు అవుతూ ఉంటాను.

నా దేశ వాసులు నాకు 50, 60, 70, ఆ తర్వాత 75 ఏళ్ళు నిండిన సందర్భాల్లో నన్ను సన్మానించారు. తపాలా ద్వారా నాకు పద్మశ్రీ పదకము, ధృవ పత్రము, అందాయి. సాహిత్య అకాడెమీ నా జన్మస్థానము, కర్మక్షేత్రము అయిన ధార్వాడ్‌కే వచ్చి నన్ను సన్మానించింది. నా కన్నడ ప్రజల మధ్యనే ఈ సన్మానాన్ని అందుకోవడం సహజంగానే నాకు చాలా సంతోషం కలిగించింది. సాహిత్య అకాడెమీ ఇచ్చిన ఫెలోషిప్ వల్ల నాకు నెల నెలా కొంత డబ్బు వస్తుందని కొందరు మిత్రులు అనుకున్నారు. జ్ఞాన పీఠ పురస్కారం రూపంలో నాకు చేసే ఈ సన్మానానికి ఆర్థిక దృష్టితో కూడా ప్రాముఖ్యత తప్పనిసరిగా ఉంది.

మనవాళ్ళు అన్నారు కూడా - 'కావ్యం అర్థ కృతే' అని. అంటే కావ్య రచనవల్ల అప్పుడప్పుడు ధన ప్రాప్తి కూడా జరుగుతూ ఉంటుంది అని. ధనం ఎంత కళంకితమైనా నేటి మతాతీత యుగంలో దాని తళుకు - బెళుకు పూర్తిగా అంతరించలేదు. నిజంగానే డబ్బుకున్న బరువు, పేరు ప్రసిద్ధులకు లేవని భావించాలా? డబ్బే వాస్తవమని, పేరు ప్రసిద్ధులు కేవలం చెవులకు సంబంధించిన విషయాలని నమ్మాలా?

ఒక రకంగా చూస్తే ప్రసిద్ధిలో కొంత కాంతి కూడా ఉంటుంది. ఆ కాంతి నన్ను చలింపచేయదు. ఎవరో కవి అన్నాడు కూడా - కవులు చనిపోయిన తర్వాత తమ ఆత్మను భూతలం పైనే వదలి వెళ్తారని. అలాంటప్పుడు వాళ్ళకు రెండేసి ఆత్మలు ఉండి తీరాలి. ఇంకోమాట కూడా మనం వింటూ ఉంటాం - ప్రేమ, బంగారు ఒకే లాంటివికావు అని. బంగారును పంచిపెడితే అది తగ్గిపోతుంది. కాని, బంగారు విషయంలో కూడా నేను ఒక మంచి మాట చెప్పగలననుకుంటున్నాను. "బంగారును ఎంతగా పంచిపెట్టినా అది బంగారుగానే ఉంటుంది."

డబ్బు, సన్మాన సత్కారాలను ప్రక్కన పెడితే చరిత్రలో సాహిత్యం సాధించిందేమిటి? అది మనిషిని ఎంత వరకు మానవునిగా చేయగలిగింది? అది తన సామాజిక రాజకీయ ఆచరణ, ప్రవర్తనలో పశు రూపంలోగాని, దానవుని రూపంలోగాని మన ముందుకురాని యుగం ఏదైనా చరిత్రలో ఉందా? ధార్మిక సాహిత్యం కూడా నల్లమచ్చలు లేకుండా లేదు. "డైవీ కామిదీ' (Divine Comedy) అనే పేరు నిజంగా సార్థకమైన పేరేనా? హిరోషిమా, నాగాసాకీలోని చల్లబడిన నిప్పులు కేవలం బూడిద అయి ఉండిపోవు. మానవ జాతిలో ఇప్పటికీ నానా జాతులు, వర్ణాలు, సంప్రదాయాలేకాక, దాని రక్తంలో మరేవేవో కూడా పరుగెత్తుతున్నాయి. సాహిత్యరసం ఈ రక్తం కంటే చిక్కగా ఉందా? ఈ సుఖదుఃఖాలు సౌందర్యాను భూతికంటే ఆహ్లాదాన్నిస్తాయా?

ప్రచారంలో లేనప్పుడు డబ్బు విలువ కేవలం కాగితం విలువకు, లేక దాని ధాతువు విలువకు సమానమైపోతుంది. సాహిత్య రూపంలో ప్రచారంలో ఉన్నప్పుడు భాష కూడా మనలను నిరాధారమైన

ఆశల వైపుకు ఆకర్షించవచ్చునేమో. అలా కానప్పుడు అది కేవలం ఒక శబ్దంగానే ఉండిపోతుంది. అంతకు మించి కాని, అందుకు భిన్నంగా కాని ఉండదు. శబ్దం కూడా బహుశా నిస్సారమైనదిగా కాని, వికృతమైనదిగా కాని అయి ఉంటుంది. అందులో వెలుగే కాదు, చీకటి కూడా ప్రత్యక్షంగా ఉంటుంది. నిజానికి శాంతి ఎప్పుడైతే వచ్చిందో, అప్పుడంతా అది యుద్ధానికి పూర్వరంగం రూపంలోనే వచ్చింది. ఆ కాలం యుద్ధ సంసిద్ధ కాలంగా ఉంటూ వచ్చింది. మానవీయమైన లేక అమానవీయమైన సమస్యలను తారుమారుగా అర్థంచేసుకొనేందుకు సంసిద్ధపడే కాలంగా ఉంటూ వచ్చింది. మానవ జాతి చరిత్ర ఇదికాక మరేమిటి? రామాయణం, భారతం, భాగవతం, ఈ మూడింటినే పరిశీలిద్దాం. మూడింటి పరిణామం విషాదంలోనే జరుగుతుంది. అందులో ఉదాత్తత ఉండినా లేకపోయినా అవి విషాదాంతాలే. రావణుడు, దుర్యోధనుడు, కర్ణుడు, కీచకుడు - వీళ్ళందరు కూడా శ్రోతలపైన పౌరుషవంతులుగా ముద్రవేస్తారు. వాళ్ళ వైఫల్యంపట్ల చాలా మంది హృదయాల్లో కరుణ కూడా జనిస్తుంది. చాలా మంది దృష్టికి వాళ్ళు గౌరవించతగిన వారుగా కూడా కనిపించవచ్చు.

ఒకసారి ఒక స్వప్న దర్శి అయిన కవి ఆవేశంతో అడిగాడు: న్యాయం, సత్యం ఉన్న పక్షానికి తగినంత బలం ఎప్పుడు చేకూరుతుంది? నిజం చెప్పాలంటే మనం సమకాలీన రాజకీయాల గురించే యోచిస్తూ ఉంటాం. కాలాతీతమైన దాన్ని గురించి, శాశ్వతమైన దాన్ని గురించి యోచించేవాళ్ళెవరున్నారు? సంభావ్యమై కూడా చూడడానికి అసంభవంగా కనిపించేది ఎప్పుడైనా జీవిత సత్యంగా రూపు దాల్చి భూతలం పైన వెలుస్తుందా? ఈ ప్రచండమైన, దుష్టమైన కాలపు పాశం నుండి సావిత్రి సత్యవంతుని ప్రాణాలను భూమిపైకి తీసుకొని రాగలుగుతుందా? శ్రీ అరవిందులు రచించిన 'సావిత్రి' మహా కావ్యం ప్రేమ, సత్యాల రహస్యోద్ఘాటనకు సంబంధించిన మహాకావ్యం.

నేను కర్నాటకలోని ధార్వాడ్ ప్రాంతం వాణ్ణని, ఆ ప్రాంతంలో ఇద్దరు మహా కవులు జన్మించారని మొదట చెప్పాను. వీరిలో ఒకరు పంప కవి. ఆయన పుట్టింది బ్రాహ్మణ కుటుంబంలో అయినా, జైన మత సిద్ధాంతాలను నమ్మేవాడు. రెండవ కవి కుమార వ్యాసుడు. ఈయన 'కర్మ'కు సంబంధించిన మహా కావ్యాన్నే భగవంతుని పట్ల ఆత్మార్పణ మహాకావ్యంగా రూపొందించాడు. ఈ ఇద్దరు మహాకవులు మహాభారతంలోని సమస్యలనే తమ కావ్య వస్తువుగా చేసుకున్నారు. పంపకవి మహాకావ్యం జైన కథ ఆధారంగా సాగింది. కాని దాని సమాప్తి ఏ విధంగా జరిగింది? వ్యాస మహాభారతం లాగా కలియుగం రాకను, సర్వ నాశనాన్ని సూచిస్తూ జరిగింది. అతని ప్రాంతం వాడినే అయిన నేను అంతకు భిన్నమైన ఏదో మంచి భవిష్యత్తును చిత్రించగలనా? నామటుకు నాకు మరో కృతయుగం రాబోతూందని అనిపిస్తూ ఉంది.

ఈ సమస్త ప్రపంచం, సమస్త భూమండలం అంతా ఒకటే. జీవితం, మానవుడు, సంపూర్ణ మానవ జాతి కూడా ఒకటే. ఇది ఒకటే సత్యం, వాస్తవం. మనం దీన్నే అనుసంధానించాలి, తర్వాత దీన్నే సాక్షాత్కరింప చేసుకోవాలి. మనం సాక్షాత్కారం చేసుకోగలిగేది సత్యాన్నే. ఏది అసత్యమో అది నిరాశను, సంక్షోభాన్ని పుట్టిస్తుంది. సత్యం పట్ల మనం అనురక్తులం కానంతవరకు, సత్యాన్ని మనం జీవితంగా, ప్రాణంగా మలచుకోనంతవరకు ఆత్మోన్నతికి, మానవోన్నతికి మేలు చేసే శక్తి మనకు లభించదు.

నేను చేతులెత్తి మీ అందరికి నమస్కరిస్తున్నాను.

**జీవిత విశేషాలు:**

కవి శ్రీ బేంద్రే ధార్వాడ్‌కు చెందిన బ్రాహ్మణ కుటుంబంలో 1896, జనవరి 31వ తేదీన జన్మించారు. వారిది మొదటి నుండి చాలా పేద కుటుంబం. వారసత్వంలో ఆయనకు రెండే ఆస్తులు సంక్రమించాయి. మంచి సంస్కారం, విద్యానురక్తి. పితామహుడు వేద పండితుడు. ఆయన శిష్యుల్లో కొందరు విరాగులయితే మరి కొందరు గొప్ప పండితులయ్యారు. తండ్రికి గండమాల జబ్బు ఉండేది. ఆయన పూర్వీకుల జ్ఞాన సంపత్తిని పుత్రునికి అందచేయాలన్న ధ్యేయంతోనే జీవించాడు. బేంద్రే కావ్య రచనా చైతన్యానికి రూపాన్ని, దిశను నిర్దేశించడంలో తల్లి ప్రముఖ పాత్ర వహించింది. తల్లి ప్రేమే బేంద్రే మనోభూమిలో సర్వప్రాణుల పట్ల ప్రేమ, గౌరవ భావాలను, ఈ సంపూర్ణ సృష్టిని కావించి, పాలించే పరమ శక్తి పట్ల అచంచల విశ్వాసాన్ని శాశ్వతంగా నాటింది. ఆయన జగత్తును మాయా రూపంగా కాక వాస్తవికమైనదిగా నమ్మేవాడు. ఈ నమ్మిక ఆధారంగా ఆయన మానవ జీవితపు స్వాతంత్ర్యానికి, కర్తవ్య భావనకు సంబంధించిన అనేక ప్రశ్నల గురించి లోతుగా ఆలోచించాడు. ఇలా ఆలోచించిన తర్వాత, సృష్టి కార్యం సమస్తం దైవేచ్ఛకు అధీనంగా ఉండి సాగుతూ ఉందనే నిర్ణయానికి వచ్చారు. అయితే ఆ సర్వోన్నత దైవీయశక్తి అనియతమైనది. నిరంకుశమైనది కాదు. అది కరుణకు ప్రేమకు నిధి. భగవంతుడు తల్లిలో ఉండే సుకుమారతతో శ్రద్ధతో తన సృష్టిని కాపాడుతూ ఉంటాడు. మాతృమూర్తిలాగా అతడు తన బిడ్డలకు స్వాతంత్ర్యం కూడా ఇచ్చాడు. నిజానికి మాతృభావంలోని ఈ దైవత్వం విషయపరంగా బేంద్రే కావ్యంలో కేంద్ర స్థానాన్ని ఆక్రమించి ఉంది. ఘోరమైన అస్తవ్యస్తత, వ్యాకులతతో నిండిన ఈ ప్రపంచంలో ఒక క్రమము, వ్యవస్థ, ఉందంటే, అది మాతృమూర్తి కృపవల్లనే. సభ్యత, సంస్కృతి వికాసం పొందడానికి కారణం కూడా ఆ శక్తే అని ఆయన నమ్మేవాడు. బేంద్రేకు ప్రతి స్త్రీ అత్యంత విలక్షణమైనదిగాను, అగాధమైన జిజ్ఞాసకు ఆలంబనంగాను కనిపించేది. స్త్రీ ఆత్మకున్న శక్తి సామర్థ్యాలను, మహత్తును ఎంత వర్ణించినా ఆయనకు తృప్తి కలిగేదికాదు.

ఆయనకు 'అంబికా తనయదత్త' అన్న మరో పేరు ఉండేది. ధార్వాడ్‌లో గేళయర్ గుంపు (మిత్రమండలి)ని స్థాపించి దాని ద్వారా చాలా మంది రచయితలకు ప్రోత్సాహం కలిగించారు. వినాయక కృష్ణగోకాక్, ముగళి, మధురచెన్న, ఆనందకంద మొదలైన రచయితలు వీరి నుండి ప్రేరణ పొందారు.

ఈయన బహుముఖ ప్రతిభాశాలి. కవిగా, నాటక రచయితగా, గద్య రచయితగా, విమర్శకుడుగా పేరు పొందారు. ముఖ్యంగా కవిగా, నాటక రచయితగా ఎనలేని ఖ్యాతి సంపాదించారు.

జ్ఞానపీఠ పురస్కారం పొందిన కవితా సంపుటి 'నాకుతంతి' (నాలుగు తీగలు)లో 44 కవితులు ఉన్నాయి. ఇందులో 6 కవితలు సమకాలీన రచయితలతో ఆయనకున్న సంబంధాల స్వరూపానికి సంబంధించినవి, ప్రజాస్వామ్యపు నిజమైన అర్థాన్ని అన్వేషించేవి. మిగతా కవితల్లో మనకు ఆలోచనల, భావాల విలక్షణమైన సమ్మిశ్రణం కనిపిస్తుంది.

బేంద్రే కన్నడ భాషలో 26 కవితా రచనలు, 2 నాటకాలు, 1 కథా సంపుటి, 9 సమాలోచనా గ్రంథాలు, 6 అనువాద రచనలు చేశారు. ఇవికాక తన మాతృభాష మరాఠీలో 3 గద్య రచనలు కూడా చేశారు.

1973వ సంవత్సరానికిగాను జ్ఞాన పీఠ పురస్కారం శ్రీ బేంద్రేకు, ఒరియా రచయిత శ్రీ గోపీనాథ మహంతికి, ఇద్దరికి సంయుక్తంగా ప్రదానం చేయబడింది. శ్రీ బేంద్రే రచించిన కవితా సంపుటి 'నాకుతంతి' శ్రీమహంతీ రచించిన 'మాటీమటాల్' అనే నవల, 1962-66 మధ్య కాలంలో భారతీయ భాషల్లో వెలువడిన సృజనాత్మక రచనలలో సర్వశ్రేష్ఠమైనవిగా ఎంపిక అయ్యాయి.

# హృదయం

- వింజనంపాటి రాఘవరావు

భగవంతుని కోసం ఎక్కడా వెతకనవసరంలేదు, హృదయంలోనే ఉన్నాడు అంటారు వేదాంతులు. సకల చరాచర సృష్టి దైనందిన అవసరాలు తీర్చి, విశ్రాంతికై తన ఇంటికి వచ్చిన భగవంతునికి

నైవేద్యమిడ నారికేళము లేదు
హృదయమే చేతి కందీయనుంటి' అంటాడు కరుణశ్రీ.

దేవదేవుని పూజకై మా ప్రాణాలు తీయకపోతే నీ 'హృదయం' రెండు చిన్ని పూలు పూయదా అంటూ 'పుష్పాలు' బీదవాణ్ణి నిలదీస్తాయి పుష్పవిలాపంలో.

'నా హృదయంలో నిదురించే చెలీ' అంటూ ఓ ప్రేమికుడు సంబరపడిపోతే, 'హృదయంలేని ప్రియురాలా' అంటూ ప్రేయసిని నిందిస్తాడు మరో భగ్న ప్రేమికుడు.

నండూరి సుబ్బారావుగారి 'నాయుడు బావ'కు 'ఎంకి'ని చూడగానే 'గుండె గొంతుకలోన కొట్లాడుతాది.'

డాక్టర్లంటే అందరికీ గౌరవమే - అయినా గుండె డాక్టరంటే మరి కొంచెం మర్యాద ఎక్కువ. శరీర ఆరోగ్యం గురించి అవగాహన ఎక్కువైన ఈ రోజుల్లో గుండెను దిటవు పరచుకోవటానికి రకరకాల వ్యాయామాలు, ఆహార పదార్థాలు-ప్రతిరోజూ పత్రికల్లో, 'రేడియో', 'టీవీ'లలో చదువుతూ, వింటూ, చూస్తూనే ఉన్నాం.

సినిమా తండ్రులకు వచ్చే అతి ముఖ్య వ్యాధుల్లో 'గుండెనొప్పి' ప్రధానమైనది. మన జీవితానికి ఆధారభూతమైనది, మన సాహిత్యాన్ని ప్రభావితం చేసిన, చేస్తున్న గుండె అనబడే హృదయం పుట్టుక, పరిణామం, పని చేసే విధానాన్ని స్థూలంగా చర్చిద్దాం...

జీవులలో శరీర ధర్మాలను నిర్వర్తించటానికి ఆహార పదార్థాలు, ఆక్సిజన్ అత్యావశ్యకాలు. శరీరంలోకి పోషకాలు ప్రవేశించిన తర్వాత వాటిని ప్రతి కణానికి, కణంలోని కణాంగాలకు చేర్చాలి. ఇది చెప్పినంత తేలిక కాదు.

అత్యంత ప్రాథమిక ప్రాణులైన 'అమీబా' వంటి ఏక కణ జీవులలో జీవ పదార్థం సహజంగానే చలిస్తుంది. దీన్ని 'బ్రేనియన్ చలనము' (Brownian Movement) అంటారు. 'పేరామసియమ్' అనే ఏక కణ జీవిలో ఆహారం ఉండే రిక్తిక (Food vacuole) నియమిత వర్తుల పథంలో ప్రయాణిస్తూ ఆహారాన్ని జీవి శరీరమంతా ప్రసరింపచేస్తుంది.

స్పంజికల వంటి ప్రాథమిక బహుకణ జీవులలో శరీరంలోని 'కాలర్ కణాల' (Collar cells) చర్యవలన, నీరు శరీరంలో ఉండే కుల్యావ్యవస్థ (canal system) అనే కాలువలలోనికి ఆహారాన్ని, ఆక్సిజన్‌ను తీసుకొని వస్తుంది.

స్పంజికల కంటె కొంచెం అభివృద్ధి చెందిన 'హైడ్రా' (Hydra), 'జెల్లీ చేప' (Jelly Fish) వంటి జీవులలో ఆహారం, ఆక్సిజన్‌లు నోటి ద్వారా జీవి శరీరంలోని జఠరప్రసరణ కుహరం (gastro vascular cavity) అనే ఖాళీ ప్రదేశంలోకి ప్రవేశిస్తుంది నీరు మరలా నోటి ద్వారానే బయటకు వెళుతుంది. పాక్షికంగా జీర్ణమైన ఆహారం ఈ నీటి ద్వారానే అన్ని కణాలకు అందుతుంది.

---

వింజనంపాటి రాఘవరావు, జంతుశాస్త్రోపన్యాసకుడు, ఆం.ప్ర.గు. జూనియర్ కళాశాల.
కొడిగెనహళ్ళి, అనంతపురం జిల్లా.

బద్దె పురుగు వర్గానికి చెందిన జీవులలో ఆహారం జీర్ణం చేసి అన్ని కణాలకూ అందించడానికి పేగు శాఖోప శాఖలుగా శరీరమంతటా విస్తరించింది. విసర్జక పదార్థాలను ప్రతికణం నుంచి గ్రహించటానికి విస్తృతమైన వ్యవస్థ ఉంది. శరీరంలో ఎక్కువ భాగాన్ని ఈ వ్యవస్థలే ఆక్రమించాయి.

శరీరం పరిమాణం పెరగాలంటే జీర్ణ విసర్జక వ్యవస్థల పరిమాణాన్ని కుదించాలి. ఈ కుదింపులో భాగంగానే ప్రసరణ వ్యవస్థ ఆవిర్భవించింది. విసర్జక అవయవాలు ప్రత్యేక ప్రాంతానికి పరిమితమైనాయి. శాఖలుగా విస్తరించిన జీర్ణవ్యవస్థ పొడవైన గొట్టం వంటి నిర్మాణంగా మార్పు చెందింది.

శరీరం పరిమాణం పెరగటం వలన వ్యాపనం ద్వారా ఆక్సిజన్‌ను అందించటం కష్టం. అందుచేత అన్ని కణాలకూ ఆక్సిజన్‌ను అందించే పనిని ఈ ప్రసరణ వ్యవస్థ తీసుకున్నది. జీవుల శరీరంలో తయారయే మలిన పదార్థాలను విసర్జకావయవాలకు చేర్చటం కూడా ప్రసరణ వ్యవస్థ పనే. జీవుల అవసరాలు పెరిగేకొద్దీ కొత్త పనులు ఈ జాబితాలో చేరాయి. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించటం, శరీరంలోకి ప్రవేశించే వ్యాధి కారక క్రిములను నాశనం చేయటం, శరీరంలో నీటి పరిమాణాన్ని సరిగా ఉంచటం అందులో కొన్ని.

ప్రసరణ వ్యవస్థ జీవుల శరీరంలో ఉండే శరీర కుహరం(coelime) అనే ఖాళీ ప్రదేశంలోని కొంత భాగం పరిణామం చెందటం వలన ఏర్పడింది.

నిజమైన శరీర కుహరం లేని ఏలిక పాము (Ascaris) వంటి జీవులలో శరీరంలో ఉండే ద్రవం ప్రసరణ విధులను నిర్వహిస్తుంది.

ప్రసరణ వ్యవస్థలో రెండు ప్రధాన భాగాలుంటాయి. మొదటిది ద్రవాన్ని 'పంప్' (Pump) చేసే పంపింగ్ (Pumping) అవయవం. రెండవది ద్రవం ప్రవహించే నాళాలు (Tubes) లేదా ఖాళీ ప్రదేశాలు (Spaces).

ద్రవాన్ని పంప్ చేసే అవయవాన్నే మనం హృదయం లేదా గుండె అంటాం. జీవి శరీరంలో హృదయంతో పాటుగా ద్రవం ప్రవహించే ఖాళీ ప్రదేశాలుంటే, ఆ వ్యవస్థను అబంధిత ప్రసరణ వ్యవస్థ (Open Type of Circulatory System) అంటారు.

గుండె, ద్రవం ప్రవహించే నాళాలు ఉండే వ్యవస్థను బంధిత ప్రసరణ వ్యవస్థ అంటారు. అబంధిత ప్రసరణ వ్యవస్థలో ద్రవం గుండె ద్వారా శరీరంలో ఉండే ఖాళీలోనికి ప్రవహిస్తుంది. ఈద్రవం శరీరంలోని అన్ని కణాలకు నేరుగా ఆహారాన్ని, ఆక్సిజన్‌ను అందిస్తుంది. అకశేరుకాలలో ఉండే ఈ ద్రవాన్ని 'రక్తకుహరలసిక ((Haemolymph), రక్త కుహర ద్రవం (Haemocoelic Fluid) అంటారు. దీన్నే మనం మామూలు భాషలో రక్తం (Blood) అంటాం.

మన శరీరంలో రక్తం ఉన్నది. రక్తం ప్రవహించటానికి రక్త నాళాలున్నాయి. ఈ రక్తాన్ని రక్త నాళాలలో ప్రవహించేలా చేయటానికి నిరంతరం పని చేసే పంపు గుండె. మన గుండె మన పిడికిలి పరిమాణంలో ఉంటుందని అందరికీ తెలుసు. కానీ అన్ని జీవులలోనూ హృదయం గుప్పెడంత పరిమాణంలో లేదు. అన్ని జీవులలోనూ ఒకే రకమైన నిర్మాణమూ లేదు. మొదట్లో రక్త నాళాల్లో మొదలైన స్పందన, ప్రత్యేకతను సంతరించుకొని ఒక ప్రత్యేకమైన అవయవంగా రూపుదిద్దుకుంది.

వానపాములో గుండె స్పందించే నాళం. వానపాములో ఉండే పృష్ఠ రక్తనాళం సంకోచ లక్షణాన్ని కలిగి, వానపాము శరీరమంత పొడవుంటుంది. రక్తం వెనుకకు ప్రవహించకుండా ఈ నాళంలో

కవాటాలుంటాయి. వానపాములలోనే పార్శ్వ హృదయాలనే గొట్టాలు కూడా సంకోచిస్తూ రక్త ప్రవాహానికి తోడ్పడతాయి. ఈ వానపాములోని పృష్ఠ రక్తనాళంలో రక్తం అలలుగా ప్రవహిస్తుంది. ఈ అలల వేగం సెకనుకు 20 మిల్లీ మీటర్లుంటుంది.

కీటకాలలో హృదయం నాళరూపంలో ఉంటుంది. వానపాములో ఉండే స్పందించే నాళానికి, నాళరూప హృదయానికి మధ్య తేడా పెద్దగా లేదు. కీటకాలలో గుండె ఒక ఖాళీ ప్రదేశంలో అమరి ఉంటుంది. గుండె గదులకు చిన్న రంధ్రాలుండి వాటి ద్వారా రక్తం గుండెలోకి ప్రవహిస్తుంది. పక్షాకార కండరాలనే (Alary Muscles) కండరాలు గుండె సంకోచానికి తోడ్పడుతాయి.

ఎసిడియన్ (Ascidians)లలో హృదయనాళం విచిత్రంగా సంకోచిస్తుంది. ఈ హృదయ నాళం ముందు ఒక వైపుకు తరంగ రూపంలో సంకోచిస్తుంది. కొంతకాలం తర్వాత వ్యతిరేక దిశలో సంకోచిస్తుంది. ఈ విధమైన హృదయం 'ఎసిడియన్ 'లకు మాత్రమే పరిమితం.

చేపల నుండి సకశేరుక జీవులన్నింటిలోనూ గదులున్న గుండెలుంటాయి. గుండెలో ఉండే గదులు వరుసలో అమరి ఉంటే వాటిని ఏకపార్శ్వ హృదయాలంటారు. రెండు వరుసలలో ఉంటే వాటిని ద్విపార్శ్వ హృదయాలంటారు.

చేపల శరీరంలోని గుండెలో రెండు గదులు మాత్రమే ఉంటాయి. దీనిలో ఒకటి కర్ణిక, రెండవది జఠరిక. చేప సిరలలో ప్రవహించే మలిన రక్తం గుండెలోని కర్ణికకు, కర్ణిక నుండి జఠరికకు - జఠరిక నుండి ప్రధాన ధమనిలోకి ప్రవహిస్తుంది. కేవలం మలిన రక్తం ఈ హృదయం ద్వారా ప్రవహించటంవలన వీటిని 'సిరా హృదయాలు (venous heart) అంటారు.

కప్ప వంటి ఉభయ చరాలలో రెండు కర్ణికలు (Auricles) ఒక జఠరిక (Ventricle)లతో మూడు గదుల గుండె ఉంటుంది. ఒక కర్ణికలోకి శుద్ధ రక్తము, రెండవ కర్ణికలోకి ఆమ్లజని రహిత రక్తం వచ్చినప్పటికీ, ఒకే జఠరిక ఉండటం వలన మిశ్రమరక్తమే కప్పల శరీరంలో ప్రవహిస్తూ ఉంటుంది. అందుకే తర్వాతి జీవులు మరి కొంత అభివృద్ధిచెందిన గుండెకోసం ప్రయత్నించాయి.

పాములు, తొండల వంటి సరీసృపాలలో జఠరికల మధ్య పాక్షికంగా గోడ ఉంటుంది. మొసళ్ళలో మాత్రం నాలుగు గదుల గుండె ఉంటుంది.

పక్షులు, క్షీరదాలలో గుండెలో రెండు కర్ణికలు రెండు జఠరికలతో నాలుగు గదుల గుండె ఉంటుంది. నాలుగు గదుల గుండె వలన ఆమ్లజనితో కూడిన రక్తము, కార్బన్-డై-ఆక్సైడ్‌తో కూడిన మలిన రక్తము విడిగా ఉంటాయి. మలిన రక్తము శ్వాసావయవాలకు వెళుతుంది. ఆక్సిజన్‌తో కూడిన శుద్ధ రక్తము శరీరావయవాలకు వెళుతుంది. దీనినే రెండు వలయాలలో రక్తం ప్రవహించటం (Double Circulation) అంటారు.

ఇప్పటివరకూ రకరకాల జీవులలో ఉండే హృదయాల నిర్మాణం గురించి చర్చించాం. ఇంతకీ మనలో గుండె ఎప్పుడు స్పందించటం మొదలు పెడుతుంది? చూద్దాం...

మానవునిలో పిండం ఎదిగే సమయంలో 18వ రోజున బఠాని గింజంత పరిమాణంలో ఉండే పిండంలో హృదయం మొదటిసారి స్పందిస్తుంది. పిండంలో మొదటిసారి గుండె కొట్టుకునే సమయానికి రక్తం ఉండదు. అయినా నిముషానికి ఒకసారి గుండె స్పందిస్తుంది. ఈ స్పందనకు కారణం ఏమిటి? గుండె కండరాల ప్రత్యేక నిర్మాణం. గుండె కండరాలను బయటకుతీసి ప్రత్యేకంగా

విడిగా ఉంచినా అవి లయబద్ధంగా సంకోచాన్ని చూపుతాయి. ఇలా 18వ రోజున మొదలైన హృదయస్పందన మనిషి జీవితాంతం వరకు కొనసాగుతుంది.

జీవుల గుండె లయబద్ధంగా సంకోచించి యథాస్థితికి చేరటానికి అవసరమైన విద్యుత్ ప్రచోదనాలు గుండెలోనే తయారైతే అట్టి హృదయాన్ని 'కండరజన్య హృదయం' ((Myogenic heart) అంటారు.

కీటకాలలోను, పీతల వంటి జీవులలోను గుండె సంకోచించటానికవసరమైన విద్యుత్ ప్రచోదనం నాడుల నుండి వస్తుంది. అందుకే వీటి హృదయాలను నాడీ జన్య హృదయా (Neurogenic heart) లంటారు.

ఈ లయారంభకము కర్ణిక (Auricle) గోడలలో ఉండి అక్కడ నుండి గుండె కండరాలకు సంకోచించమనే సందేశాన్ని ప్రత్యేకమైన పోగుల ద్వారా పంపుతుంది. కర్ణికల నుండి జఠరిక (Ventricles) లకు సందేశం చేరటంలో జరిగే జాప్యం వలన, ముందుగా కర్ణికలు, తర్వాత జఠరికలు సంకోచిస్తాయి. జఠరికలు సంకోచించే సమయానికి కర్ణికలు యథాస్థితికి వస్తాయి. నాలుగు గదులూ ఒకసారి సంకోచించి యథాస్థితికి రావటమే హృదయ స్పందన వలయం (Cardiac Cycle).

జఠరికలు సంకోచించినప్పుడు కర్ణికలకు, జఠరికలకు మధ్య ఉండే కవాటాలు మూసుకొని 'లబ్' (Lubb) లనే శబ్దం వస్తుంది. జఠరికలు యథాస్థితికి వచ్చినప్పుడు ప్రధాన ధమనులలోని కవాటాలు మూసుకొని డబ్ (Dubb) అనే శబ్దం వస్తుంది. ఒకసారి హృదయం స్పందించటానికి 0.49 సెకండ్ల వ్యవధి అవసరం.

మనం మన హృదయం విరామం లేకుండా నిరంతరం పని చేస్తుందనుకుంటాం. కాని ప్రతి హృదయ స్పందనానికి మధ్య సుమారు 0.31 సెకండ్ల విరామం ఉంటుంది. ఒక రోజులో మన గుండె సుమారుగా ఎనిమిదిన్నర గంటలు పనిచేసి పదమూడున్నర గంటలు విశ్రాంతి తీసుకుంటుంది. అయితే ఈ విశ్రాంతి ఒకేసారి కాకుండా రెండు స్పందనల మధ్యలో నన్నమాట.

అంటే మరి గుండె చేస్తున్న పని మరీ తక్కువా అని మీకు సందేహం రావచ్చు. జీవి దేహం పరిమాణాన్ని బట్టి గుండె తీరు ఆధారపడి ఉంటుంది.

నూటయాభై టన్నుల బరువుండే నీలి తిమింగలం గుండె నిముషానికి ఏడుసార్లు స్పందిస్తుంది. మూడు టన్నుల బరువున్న ఏనుగు గుండె నిముషానికి నలభై ఆరుసార్లు కొట్టుకుంటే, కేవలం ఎనిమిది గ్రాముల బరువుండే కోయిల్ టిట్ (Coal tit) అనే పక్షి గుండె నిముషానికి 1200 సార్లు స్పందిస్తుంది.

నీలి తిమింగలం గుండె 750 కిలోల బరువుంటే 'కోయిల్ టిట్' అనే పక్షి గుండె బరువు కేవలం 0.15 గ్రాములే. గుండె బరువు ఎంత ఉన్నా నిముషానికి ఎన్నిసార్లు స్పందించినా, రక్తాన్ని శరీరంలోని అన్ని భాగాలకూ చేరవేయటం కోసమే.

మనలో రక్తం అన్ని శరీరభాగాలనూ చుట్టి తిరిగి గుండెకు చేరటానికి 23 సెకండ్లు పడుతుంది. సుమారుగా రోజుకు 3700 సార్లు రక్తం శరీరాన్ని చుట్టి వస్తుంది.

ఇదే కుక్కలో 16 సెకండ్లకు ఒకసారి, కుందేలులో ఏడున్నర సెకండ్లకు ఒకసారి రక్త భ్రమణం పూర్తయితే, కీటకాలలో 35 సెకండ్లకు ఒకసారి పూర్తవుతుంది.

మన జీవితకాలంలో గుండె చేసే పనితో ఒక గూడ్సు రైలును నాలుగువేల ఎనిమిదివందల మీటర్లు ఎత్తుకు ఎత్తగలం.

ఒక వ్యక్తి జీవిత కాలంలో రెండు లక్షల టన్నుల రక్తాన్ని గుండె పంపు చేస్తుంది. ఇతర జంతువుల గుండెతో పోలిస్తే మన హృదయం మరీ అంత గొప్పగా ఏమీ పని చేయటం లేదు. కుక్క గుండె పనితీరు మనకు రెండురెట్లు, పిల్లి గుండె పదిరెట్లు ఎక్కువ రక్తాన్ని పంపిణీ చేస్తాయి. అతి నెమ్మదిగా కదిలే నత్త గుండె మన గుండె పనికి సమానమైన పనితీరు ప్రదర్శిస్తుంది.

నలభైఏళ్ళ వయసు దాటినవారు డాక్టరు దగ్గరకు వెళితే ముందుగా B.P. చూస్తారు. B.P. ఎక్కువ తక్కువలను బట్టి మందుల వాడకాన్ని సూచిస్తారు. ఇంతకీ ఈ B.P అంటే ఏమిటి? మన ఇంట్లో పంపులో నీరు రావాలంటే ఎంతో ఎత్తుగా నీళ్ళటాంకు కడతారు. దాని నుండి పెద్దగొట్టాలు, తర్వాత మధ్యరకం గొట్టాలు చివరకు ఇంట్లోకి అరంగుళం వ్యాసం ఉండే గొట్టాలు వేస్తారు. నీరు వదిలినప్పుడు మనకు ఒక క్రమపద్ధతిలో ఒకే ఒత్తిడితో నీరు వస్తుంది. టాంకులో నీరు తగ్గితే ఒత్తిడి తగ్గుతుంది.

మన శరీరంలో రక్తనాళాలలో రక్తం ఈ ఒత్తిడి సూత్రం పైనే పని చేస్తుంది. రక్తం మెదడు నుంచి కాలివ్రేళ్ళ చివరివరకూ ప్రవహించాలంటే ఎంతో వత్తిడి అవసరం. గుండె రక్తాన్ని పంప్ (Pump) చేసినప్పుడు రక్తం రక్తనాళాలపై కలుగజేసే ఒత్తిడే రక్తపీడనం. ఇది ఆరోగ్యవంతుడైన మానవునిలో 120/80m.m.$H_g$ గా మిల్లీమీటర్లు పాదరస పీడనం. ఈ రక్త పీడనాన్ని 'స్ఫిగ్మో మానోమీటర్' (Sphygmomano Meter) అనే పరికరంతో కొలుస్తారు. హృదయం సంకోచించినప్పుడు (Systole) ఈ పీడనం ఎక్కువ అంటే 120 గాను, హృదయం సడలినప్పుడు (Diastole) తక్కువగానూ అంటే 80 వరకు ఉంటుంది. దీనిలో తేడాలు వస్తే మనం రక్త పీడనాన్ని నియంత్రించటానికి మందులు వాడాలి.

120 mm $H_g$ ఒత్తిడితో రక్తం గుండె నుండి విడుదలైనప్పటికీ, రక్త కేశనాళికలను చేరేప్పటికి ఈ పీడనం 40కి పడిపోతుంది. ఇదేరక్తం 'సిరికను' చేరేప్పటికి 10 మిల్లీమీటర్ల స్థాయికి తగ్గిపోతుంది. కణజాలలో పీడనం నలభై కంటే తక్కువ ఉండటం వలన రక్తనాళాల నుండి నీరు పోషక పదార్థాలు వడపోత ద్వారా బయటకు వస్తాయి. సిరిక (Veule)లో ద్రవపీడనం 10 ఉండి, కణజాలాలో ఎక్కువ అంటే 25 ఉండటం వలన నీరు కణజాలాల నుండి సిరికలోకి లాగబడుతుంది. దీని వలన రక్తపు ఘనపరిమాణం దాదాపు స్థిరంగా ఉంటుంది. ఇంకా కణజాలాలలో మిగిలిన నీరు శోషరస వ్యవస్థ (Lymphaticsys) ద్వారా సిరలను చేరుతుంది.

రక్త నాళాలలో ఏదైనా అడ్డుపడినప్పుడు ఈ ఒత్తిడి మరింత ఎక్కువ అవసరం అవుతుంది. శరీర భాగాలకు రక్తం అవసరమైనంతగా సరఫరా కాదు. వాటి పని మందగిస్తుంది. అదే హృదయానికి రక్తాన్ని సరఫరా చేసే హార్థిక ధమనిలో క్రొవ్వు వంటి పదార్థాలు పేరుకుంటే గుండె కండరాలకు రక్తం అందక అవసరానికి మించి విరామం తీసుకుంటాయి. ఈ స్థితినే 'గుండెపోటు, (heart attack) అంటారు. గుండెపోటుకు గురైన రోగులలో వేరే మార్గం ద్వారా గుండె కండరాలకు రక్తాన్ని సరఫరా చేసే విధానమే బైపాస్ సర్జరీ (Bypass Surgery).

జీవి శరీర పరిమాణం పెరిగే కొద్దీ రక్తపుపోటు ఎక్కువగా ఉండాలి. ఇది సహజం. కాని ఈ నియమానికి విరుద్ధంగా కూడా ఉండొచ్చు. ఒక కోడిపుంజు రక్తపుపోటు, గుఱ్ఱం రక్తపుపోటుకు సమానంగా ఉంటుంది.

ప్రాణి ప్రపంచంలో చాలా జీవుల శరీరం నేలకు సమాంతరంగా ఉంటుంది. దీనివలన మెదడుకు రక్తం సాఫీగా తేలికగా సరఫరా అవుతుంది. పాము, కుందేలు వంటి జీవులను ఎక్కువసేపు నిలువుగా ఉంచామనుకోండి మెదడుకు ఆక్సిజన్, గ్లూకోజ్ సరిగా అందక అవి స్పృహ తప్పి పడిపోతాయి. అలాగే వాటిని శీర్షాసనం వేయించినా ఇబ్బంది పడతాయి. ఎల్లప్పుడూ తలక్రిందులుగా వ్రేలాడుతూ, ఎగిరేప్పుడు నిలువుగా ఉండే గబ్బిలాలు మాత్రం రక్తం సరఫరా విషయంలో పెద్దగా ఇబ్బంది పడవు.

ఏదైనా ప్రధాన రక్తనాళం తెగి రక్తస్రావం జరిగితే ఏమౌతుంది? శరీరంలో రక్తం తగ్గటం వలన రక్తపీడనం పడిపోయి జీవి మరణిస్తుంది. కాని సాధారణంగా అలా జరగదు. ధమనుల వ్యవస్థలో ప్రధాన ధమనిలోను, మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులలోనూ రక్తపీడనాన్ని కొలిచే బారో రెసెప్టార్స్ (Baro Receptors) అనే పీడన గ్రహకాలుంటాయి. రక్తపీడనంలో వచ్చే మార్పులను ఇవి మెదడుకు వెంటనే తెలియజేస్తాయి. మెదడు రక్తనాళాల గోడలు సంకోచించేలా చేసి పీడనాన్ని యథాస్థితికి తీసుకొస్తుంది. మరీ ఎక్కువ రక్తస్రావం జరిగినప్పుడు వెంటనే రక్తాన్ని కృత్రిమంగా ఇవ్వకపోతే ప్రాణాపాయం.

గుండె కండరాలు సహజసిద్ధంగా సంకోచించే స్వభావం కలిగి ఉంటాయని తెలుసుకొన్నాం. గుండెలోని లయారంభకం ఈ సంకోచాలను క్రమబద్ధం చేస్తుంది. అయితే మెదడు నుండి గుండెకు వచ్చే నాడులు, శరీరంలో ఉత్పత్తి అయ్యే అంతఃస్రావీయ గ్రంథుల స్రావాలు, హృదయ స్పందన వేగంలో మార్పులు తీసుకొని రాగలవు. ఒక గుండెకు ఒక లయారంభకం సహజం. కాని 'ఎసిడియా' అనే జీవిలో నాళాకారంగా ఉండే హృదయంలో రెండు లయారంభకాలుంటాయి. దీనివలన ఎసిడియాలో రక్తప్రసరణ కొంతసేపు ఒక వైపు తర్వాత వ్యతిరేక దిశలో జరుగుతుంటుంది. ప్రకృతి అంటేనే వింతల సమాహారం.

మానవునిలో ఈ లయారంభకం సరిగా పనిచేయకపోతే హృదయ స్పందన లయ తప్పుతుంది. దీన్ని సరి చేయటానికి శరీరం బయట కృత్రిమ లయారంభకాన్ని అమరుస్తారు. సరైన పరిస్థితులలో శరీరం నుంచి బయటకు తీసిన కప్ప గుండె గ్లూకోజ్, ఆక్సిజన్‌లు లభిస్తే కొన్నిగంటల వరకు సంకోచిస్తూనే ఉంటుంది.

నిరంతరాయంగా పనిచేసే హృదయాన్ని అత్యంత జాగరూకతతో కాపాడుకోవాలి. అందుకే హృదయం రెండుపొరల హృదయావరణ త్వచంతో కప్పబడి ఉంటుంది. ఘర్షణ తగ్గించటానికి ఈ రెండు పొరల మధ్యలో ద్రవం ఉంటుంది. ఈ ద్రవం బయట నుండి వచ్చే షాక్ (Shock) ల నుండి హృదయాన్ని రక్షిస్తుంది.

హృదయాన్ని గురించిన అత్యంత ప్రాథమిక సమాచారం విన్నారు కదా? శరీరంలో అత్యంత ప్రధాన భాగమైన గుండెకు సంబంధించిన జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో నిత్యం సమాచార సాధనాలు మన ముందుంచుతున్నాయి. ప్రాచీన కాలంలో గ్రీకులు హృదయం ఆలోచనలకు స్థానం అని నమ్మేవారు. అందుకే ఇప్పటికీ హృదయంతో ఆలోచించమంటుంటాం. హృదయం గురించి ఆలోచించమనేది ఆధునిక నానుడి. అనవసర విషయాల గురించి తక్కువ ఆలోచించండి. ఆరోగ్యంగా ఉండండి.

(ఆకాశవాణి అనంతపురం కేంద్రం ప్రసారితం)

# మహాభారతం - ఒక మానవతా రూపచిత్రం

మూలం : జువాన్ మిగ్యూల్‌మోరా అనువాదం: బి.వి. రామిరెడ్డి

సాహిత్య అకాడెమీ, ఢిల్లీ స్వర్ణోత్సవాల సందర్భంగా మహాభారతాన్ని పునర్వ్యాపనం చేయించాలనే ఉద్దేశంతో, దానిమీద అంతర్జాతీయ సెమినార్‌ను మార్చి 2004లో నిర్వహించారు. ఈ గొప్ప ఇతిహాసం మీద, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మహాపండితులు, వివిధ పక్షాల గురించి చర్చ చేశారు. మహాభారతానికి సంబంధించిన సామాజిక, రాజకీయ, చారిత్రక, నైతిక విషయాల మీద వారు సమర్పించిన అనేక పత్రాలను "Indian Literature" (సాహిత్య అకాడెమీ) 225 సంచిక (Jan-Feb, 2005) లో ప్రచురించారు. వాటిలో మిసిమి కొన్నింటిని ఎంపిక చేసి, అనువదింపజేసి, మిసిమి 'డిసెంబరు 2005 సంచిక' నుంచి ప్రచురిస్తోంది.

మహాభారతం లక్షపై చిలుకు శ్లోకాలున్న హిందూమత మూలకందమైన గొప్ప ఇతిహాసం. ఇది ప్రపంచంలోనే అతి దీర్ఘమైన వాటిల్లో రెండో కృతి. మొదటిది టిబెటన్ గెసర్ కథ. బైబిలుకు నాలుగు రెట్లు పెద్దది. గ్రీకు పురాణమైన ఇలియడ్, ఒడెసీలు రెండు కలిపిన దాని కంటె ఏడు రెట్లు పెద్దది. హిందూమత గర్భమనదగిన భగవద్గీత ఇందులో భీష్మ పర్వం వస్తుంది.

మహాభారతం ఆదర్శ జీవితం ఏది? అనే దానికి సమాధానం చెప్ప ప్రయత్నిస్తుంది. మనం చేసే జీవన సమరంలో బ్రతికి బట్ట కట్టాలంటే, ధర్మమొక్కటే శరణ్యం అంటుంది భారతం. ఒక సమాజాన్ని చితికిపోకుండ, ఒక వ్యవస్థగా ఉంచేది విశాల నైతిక సంహితయే. ధర్మార్థ కామ మోక్షాలలో మొదటిది ధర్మమే. ధర్మమే పునాది. మనో వికాసానికి, సమాజ స్థిరత్వానికి ధర్మమే ఆవశ్యకమైంది. - సం.

హిందూదేశపు సాహిత్య ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, గొప్ప మానవతా వాదాన్ని నిరూపించే మహాగ్రంథం మహాభారతం. మానవ జీవితానికి సంబంధించిన ఆలోచన, కార్యం, ధ్యానం, ఊహా చిత్రాలు, ఉదాహరణలు, సూత్రీకరణలు మొదలైనవెన్నో కలిసిన మహాప్రవాహం మహాభారతం. అందులో అన్నీ వున్నాయి. దీనిలో మానవ స్వభావంలోని రెండు ప్రాచీన శక్తులు ఎల్లప్పుడూ ఒక దానితో వొకటి సంఘర్షించుకోవడం మనం చూస్తాం. అవి యుద్ధమూ, ప్రేమా. యుద్ధం అంటే అన్ని రూపాల సాంఘిక అన్యాయాలు, హింస, మానవ హక్కుల్ని హరించడం. ప్రేమకు సంబంధించిన అన్ని రూపాలూ, అన్నిటినీ ఇందులో చర్చించవలసి వుంటుంది. ఈ భూమిమీద గ్రహవాసులు అనేక రంగుల శరీరాలతో, కళ్ళతో, వివిధ రకాలైన భాషలతో, అలవాట్లతో, ఆచార వ్యవహారాలతో ఉన్నారనుకుందాం. అయితే వాళ్ళంతా, ఎప్పుడూ తమ కాలంతో తాముంటారు - యుద్ధ శక్తితోనో, లేదా ప్రేమ శక్తితోనో. మహాభారతంలో ఇవన్నీ వున్నాయి. ఈ మహాపురాణంలో రెండు రకాల మనుషులున్నారు. ఈ రెండు రకాల శక్తులూ ఒక దానినొకటి ఎదుర్కొంటూనే వుంటాయి. అవి అనేకానేక మానవ జీవన తత్త్వాలను విశదీకరిస్తూనే వుంటాయి. ఆశ్చర్యాన్ని కలిగించే విషయం ఏమిటంటే, పాశ్చాత్య సాహిత్యంలో మృత్యువు ప్రేమను జయిస్తుంది, అయితే భారతీయ సాహిత్యంలో ప్రేమ మృత్యువును జయిస్తుంది.

అన్ని విషయాల్లోను మహాభారతం భారతదేశ సరిహద్దులనే గాక, నిత్యమూ మృత్యువు ప్రేమను జయించే గ్రహవాసులను, ప్రేమతో మృత్యువును జయించింది, మృత్యువును ప్రేమగా మార్చివేసింది. గొథె స్టెల్లా నుండి వ్యాసుడి ద్రౌపది, సావిత్రి దాకా; ప్రేమమీద మృత్యువే విజయకేతనం ఎగురవేయాలనే ప్రజానీకం; ప్రేమ యొక్క అనేకానేక రూపాలను అంగీకరించడం - ఇవి రెండూ రెండు దృక్పథాలు, ఒకే జీవితాన్ని రెండు కోణాల నుండి వీక్షించడం.

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, విజయవాడలో ఆంగ్లోపన్యాసకులుగా పదవీ విరమణ. ప్రస్తుత నివాసం కృష్ణాజిల్లా రుద్రవరం.

మహాభారతం మొత్తం ప్రపంచ మానవాళికి చెందిన మహాపురాణం కావడానికి కారణం అందులోని సున్నితమైన సందేశం. అన్ని కోణాలను, మానవ జీవితానికి చెందిన అన్ని రూపాలను వాస్తవ సత్యంగా ముందుంచడం దాని ప్రత్యేకత. ఈ గ్రంథం మంచీ చెడులను గురించి వివరిస్తుంది. పాత్రలను గొప్పగా విశ్లేషిస్తుంది. అయితే సైతాను కూడ దేవునివలె నిత్యుడనే నిర్ణయం చెయ్యదు. ఇక్కడ మంచి చెడ్డలను కొలవడం ముఖ్యంకాదు. లోకంలో మంచివాళ్ళందరూ సంపూర్ణ మానవులు కారు. అలాగే చెడ్డవాళ్ళందరూ సంపూర్ణంగా చెడ్డ వాళ్ళుకారు. ఇందులో మొదటిరకంవాళ్ళు ధీరత్వపు సిద్ధాంతాలను గౌరవించరు. అంతేగాక భీముడికీ దుర్యోధనుడికీ మధ్య సంఘర్షణను సమర్థించరు. రెండోరకం వాళ్ళు అత్యాశాపరులు. అత్యాశ ఎప్పుడూ మానవ సహజ లక్షణమే కదా!

ఈ గ్రంథ నిర్మాణమూ, పరిణామమూ క్షత్రియులకు సంబంధించిన అధికారం కోసం పోటీకి సంబంధించినది. అందుచేతనే ఈ మహాగ్రంథం హింసతో నిండి వుంది. ఇందలో సంభవించిన 18 రోజుల యుద్ధం, తరువాత పాండవుల అనుయాయుల్నీ, ఉప పాండవులను వధించడం, యుధిష్టరుడి అశ్వమేధ యాగం, ప్రభాస తీర్థంలో కృష్ణుడు ఏర్పాటు చేసిన విందు, ద్వారకలో అర్జునుడి ఓటమి - ఇవన్నీ హింసాపూరితంగానే వున్నాయి. అయితే మహాభారతం జీవితం లాంటిది. ఎన్నో సంఘటనలు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా జరిగి పోతూనే వుంటాయి.

అందుకే కృష్ణుడు దుర్యోధనుడితో అంటాడు: "క్షత్రియ ధర్మాన్ని పాటించే వారు కొడుకుతో, తండ్రితో, సోదరుడితో, మేనల్లుడితో, మేనమామతో, బంధువులతో, ఆత్మీయులతో యుద్ధం చేస్తారు. వారు యుద్ధంలో చనిపోతే అందులో ఔన్నత్యం వుంది. అలాగే యుద్ధ భూమి నుండి పారిపోతే అది మహాపాపం. అందువల్లనే క్షాత్ర జీవితం కఠినమైనది" (శల్యపర్వం).

ఇది యుద్ధాన్ని గురించిన తిరుగులేని విమర్శ. అందుకే ఈ కథంతా రక్త సిక్తం. మహాభారతం గొప్పదనమంతా అందులోని మనుషుల కార్యకలాపాలు; దేన్నీ వెనకేసుకుని ప్రత్యేక ప్రాధాన్యత నివ్వకపోవడం - ఈ కావ్యానికి విశ్వజనీనతను సంతరించి పెట్టాయి. మానవజాతి చరిత్రంతా యుద్ధాలు, రక్తపాతాలే కదా!?

మానవ జీవిత విశ్లేషణకు సంబంధించిన గొప్ప వివరణ మనముందుంచబడింది. చారిత్రాత్మకమైన కార్యకలాపాలను గురించిన సాహితీ సౌరభం, దేన్నీ వొదలని వివరణ కళాత్మక సత్య స్వరూపంగా మనముందుంచబడింది.

క్షత్రియులు, యుద్ధాలు, రక్తపాతాలు మాత్రమే కాకుండా వాటితో బాటు సమాంతరంగా మృత్యువును జయించే ప్రేమ కూడా మనముందుంచబడింది. గొప్ప ప్రేమ అంతం కాదనీ, అది మృత్యువును కూడా జయిస్తుందని చెప్పే ద్రౌపదీ పంచ పాండవుల ప్రేమగాథ ఇందుకుదాహరణ. వారిలో వారికి అప్పుడప్పుడు ఉత్పన్నమయ్యే తేడాలు - ఉదాహరణకు ద్రౌపదికి భీముడికి యుధిష్ఠిరుడితో కలిగిన విభేదాలు. అవి వారి సహజాతాలనుకాని, బాహ్య సంబంధాలమీదకాని, పరస్పర ఆత్మీయతలనుగాని ప్రభావితం చెయ్యవు. యుధిష్ఠిరుడు ద్రౌపదిని ప్రేమించకమానడు. అతడు ధర్మరాజు, ధర్మానికి వ్యతిరేకమైన ఏ పనీ చెయ్యడు. తన సోదరులతో బాటు ఆమెకు లొంగే వుంటాడు.

ఒక స్త్రీకి, అయిదుగురు పురుషులకీ మధ్య ప్రేమ సాంఘిక ధర్మానికి అనుగుణంగా వుందా? అని కొందరనుకోవచ్చు. ఇతరుల స్వేచ్ఛకు సరిహద్దులు నిర్ణయించే గ్రహవాసి అలా అనుకుంటాడు. ఉదాహరణకు మౌసల పర్వంలో ద్వారక నుండి అర్జునుడు వెనుదిరిగినప్పుడు అతనిలోని మార్పుల్ని

వర్ణించే సందర్భంలో: "ఓ బ్రాహ్మణుడా! నా కళ్ళముందే వేలాది మంది వృష్ణి స్త్రీలను పంచ ప్రవాహ దేశీయులైన అభీరులు మామీద దాడిచేసి ఎత్తుకు పోయారు."

అనువాదకుడు "ఎత్తుకు పోయారు" అన్నాడు. ఆ మాటకు రెండర్థాలున్నాయి. అయితే మెడెలిన్ బియార్డీ, ఇతర ఇండోలజిస్టులు చాలామంది స్త్రీలు శత్రువులతో తమంత తామే వెళ్ళిపోయినట్లు చెప్పారు... ఇప్పుడు ఆ స్త్రీలలో చాలామంది ఒకేసారి అయిదుగురు సోదరుల్ని భర్తలుగా పెళ్ళాడిన ద్రౌపదిని ఘాటుగా విమర్శించారు.

సాంఘిక కట్టుబాట్లు శక్తివంతమైనవి. కుంతి ఆ కట్టుబాట్లను అతిక్రమించినందుకు కర్ణుణ్ణి యమునా నదిలో వొదిలివేసింది. వివాహానికి ముందే సూర్యుడివల్ల గర్భవతియై కర్ణుడికి జన్మనిచ్చింది. అలా ప్రవర్తించి ఆవిడ అధికారిక నీతుల దశలో ప్రవేశించింది. అంటే అధికారంలో వున్నవారు అప్పుడప్పుడు సాంఘిక నియమాలను ఉల్లంఘించడం పొరబాటు కాదు.

పాండవులైదుగురు ద్రౌపదిని ప్రేమించారు, ద్రౌపది అయిదుగురినీ ప్రేమించింది. అయితే నీతినియమాలు ప్రేమకు కొన్ని ఆంక్షలు విధిస్తాయి. వాటిని బాహాటంగా అతిక్రమించడం అంటే ప్రపంచాన్ని ఎదుర్కోవడం.

యుధిష్ఠిరుడు ద్రుపదుడితో ద్రౌపది తమ సోదరులైదుగురినీ వివాహమాడుతుందని చెప్పినప్పుడు ద్రుపదుడు గాభరాపడ్డాడు. "కుంతీ కుమారా! నీవు పవిత్రుడవు, నీతిశాస్త్ర కోవిదుడవు. అట్టి నీవు నీతి బాహ్యమైన పని చేయకూడదు. అలాంటి పనులను వేదం నిరసిస్తోంది కదా. మరి అన్నీ తెలిసిన నీవు ఇలా చేయవచ్చునా?" అన్నాడు.

యుధిష్ఠిరుడు తన నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు: "మహారాజా, నీతి జటిలమైనది. దాన్ని మనం నిర్ధారించలేము. అందుచేత మనం గత యుగాలకు చెందిన ప్రసిద్ధులూ, విజ్ఞులూ నడిచిన మార్గాన్నే పయనిద్దాం" (ఆదిపర్వం 195). అంతేగాక ప్రత్యేకమైన సందర్భాలలో జరిగిన సంఘటనలను ప్రామాణికంగా తీసుకోవాలి:

"నేను పురాణాల్లో విన్నాను, - గౌతమ వంశానికి చెందిన 'జటిల' అనే వొక మహిళ, పునీతురాలు, ఏడుగురు ఋషుల్ని వివాహమాడింది. అలాగే ఒక ఋషి కన్య పదిమంది సోదరులను పెళ్ళాడింది. వారిందరిదీ ఒకే పేరు - ప్రచేతసులు. వారందరి ఆత్మలు బ్రహ్మ చర్యంతో ఉన్నత స్థితిని అందుకున్నాయి." (ఆది పర్వం 196).

భారత దేశపు గొప్పదనం ఏమిటంటే, వ్యాసుడు, కృష్ణుడు, ఇలాంటి ప్రత్యేక సందర్భాలను వొప్పుకున్నారు. మహాభారతం ఒక మహాకావ్యం. ఇందులో మానవ జాతికి చెందిన ఎంతో జ్ఞానం నిక్షిప్తమై వుంది. అందుచేతనే ఒకప్పటి హస్తినాపురంలోను, నేటి న్యూయార్కులోను కూడా దానికి అంత ఉన్నతమైన విలువ. మహాభారతాన్నర్థం చేసుకోవడానికి ఎంతో జ్ఞానశక్తి అవసరం. ప్రాచ్య, పాశ్చాత్య రచయితలు రచించిన ఏ మహాకావ్యమూ మహాభారతానికి సాటిరాదు. మానవ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని, జీవితపు నాటకశాలలో దానికి సంబంధించిన జ్ఞానాన్ని విశ్లేషించడంలో మహాభారతానికి ఏదీ సాటి రాదు.

ఈ మహాకావ్యంలో ఎన్నో కథలున్నాయి; పురాణగాథలున్నాయి. ఇవి ప్రధాన కథకు అనుసంధింపబడి వుంటాయి. ఇదే సంవిధానం చాలా భారతీయ కావ్యాల్లో కనుపిస్తుంది. కథలోనికథ ఉపాఖ్యానం. ఈ కథల్లో గొప్ప సాహితీ విలువలున్నాయి. కొన్నిటిలో గొప్ప కథామూలం వుంటుంది. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలను పోల్చి విశ్లేషించే పండితుల్ని ఇందులోని ప్రేమ కథలు గొప్పగా ఆకట్టుకుంటాయి.

ప్రేమ మానవ జీవితంలోని ప్రధానాంశం. మహాభారతంలో ప్రేమ మృత్యువును జయిస్తుంది. అందులో పాండవుల ప్రేమ కథకూడా వొకటి. ఈ పురాణ గ్రంథమంతా ప్రేమ కథలతో క్రిక్కిరిసిపోయింది. ప్రతి కథలోను ఏదో విధంగా ప్రేమ మృత్యువును జయిస్తుంది. వీటిలోని కొన్ని కథలు వేరే గ్రంథాల్లో కూడా కనుపిస్తాయి. ఉదాహరణకు ఋష్య శృంగుడి కథ. ఈ కథలో లోమపాదుడి రాజ్యమైన అంగదేశంలో భయంకరమైన కరవు తాండవిస్తుంది. ఎప్పుడూ జీవితంలో స్త్రీని చూడని ఋషికుమారుణ్ణి రాజ్యంలోకి తీసుకువొస్తే వర్షాలు కురుస్తాయని విజ్ఞులు చెప్పారు. రాజకుమార్తె శాంత తమ దేశంలో వర్షం కురిపించి కరవును అంతం చేయాలని నిర్ణయించుకుంటుంది. ఆమె ఋషికుమారుడిలా మారువేషం వేసుకుని ఋష్య శృంగుడికోసం బయలుదేరింది. ఋష్య శృంగుడు ఆమె అందానికి ఆకర్షణకు వశ్యుడౌతాడు. ఆమెను గురించి ఋష్యశృంగుడు తన తండ్రికి ఇలా వివరిస్తాడు: "ఒక ఋషి కుమారుడొచ్చాడు. అతని కేశాలు అందంగా అలంకరించబడి వున్నాయి. అతడు బంగారు రంగులో ధగధగా మెరిసిపోతున్నాడు; దేవుని కుమారుడిలా వున్నాడు. అతడు మరీ ఎత్తూ కాడు, మరీ పొట్టీ కాడు - సరిపడ ఎత్తు. అతడు యోగిలా వున్నాడు. అతని కనులు విశాలంగా పద్మ పత్రాల్లా వున్నాయి. అతనికి పొడవైన నల్లని జడ వుంది. ఆ జడను అతడు అందమైన రంగుల పూలతో అలంకరించుకున్నాడు. ఆ పూలనతడు బంగారు గొలుసులతో కట్టి జడలో తురుముకున్నాడు. అతని మెడలో మేఘంలోని మెరుపుతీగ లాంటి అందమైన ఆభరణాలున్నాయి. అతని మెడక్రింద రెండు అందమైన మాంస గోళాలున్నాయి, అవి రోమరహితంగా అందంగా వున్నాయి."

అతని తండ్రి వొప్పుకోకపోయినా ఋష్యశృంగుడు లోమపాదుని కుమార్తెతో అంగదేశానికి వెడతాడు. అతడు అంగదేశంలో అడుగుపెట్టిందే తడవుగా వర్షాలు కురిశాయి. అంతా సుఖాంతమయింది. రాజు ఋష్యశృంగుణ్ణి అల్లుడుగా చేసుకున్నాడు. అతని తండ్రికి ఎన్నో విలువైన వస్తువులు బహూకరించాడు. ప్రేమ గెలిచింది.

ఇతర ప్రేమ కథల్లో నలదమయంతుల కథ, శకుంతలోపాఖ్యానం, అద్భుతమైన సావిత్రీ సత్యవంతుల కథ ముఖ్యమైనవి. సావిత్రి తాను ప్రేమించి పెళ్ళాడిన భర్త సత్యవంతుణ్ణి యముడి నుంచి జయించుకుంటుంది. సావిత్ర పాత్రలోని నీతిమత్వం కథా సౌందర్యం, కథనం ప్రేమ మృత్యువును ఎలా జయిస్తుందో ప్రతీకాత్మకంగా వర్ణించబడింది.

ఇది చాలా ప్రసిద్ధమైన కథ. అందుకే ఈ కథను మళ్ళీ మీకు గుర్తు చేసే ప్రయత్నం చేస్తాను. యముడు సావిత్ర భర్త సత్యవంతుడి ఆత్మను తీసుకుని యమలోకానికి బయలుదేరతాడు. సావిత్రి అతణ్ణి అనుసరిస్తుంది. ఆమె అలా తన వెంటరావడం భావ్యం కాదనీ, తిరిగి వెళ్ళి భర్తకు అంత్యక్రియలు నిర్వర్తించవలసిందనీ, అది భార్యగా ఆమె ధర్మమనీ యముడామెకు తెలియజేస్తాడు. యముడు తనను వెనుదిరిగి వెళ్ళమని ఆదేశించిన ప్రతి పర్యాయమూ సావిత్రి ఏదో ఒక నీతినీ, తాత్త్విక సూత్రాన్నీ గుర్తు చేస్తుంది. ఆమె చెప్పిన విషయాలు చాలా విలువైనవని యముడు గ్రహిస్తాడు. ప్రతిసారి ఆమెకు భర్త ప్రాణాలు తప్ప ఏదోవొక వరం ప్రసాదిస్తుంటాడు.

సావిత్రి అంటుంది: "ప్రతివొక్కరికి మంచి మనిషి ఒక్కసారే దర్శనమిస్తాడు. అది కోరుకోదగిన గొప్ప అదృష్టం. అలాంటివారితో గొప్ప స్నేహం ఏర్పడుతుంది. అలాంటి గొప్ప వ్యక్తితో ఏర్పడ్డ స్నేహ బంధం వృథాగాపోదు. అందుచేత మనమందరం నీతివంతులతో కలిసి జీవించాలి."

సావిత్రి యొక్క స్థిర నిర్ణయం ప్రేమశక్తితో నిండి వుంది: "నా భర్త లేకపోతే నేను చనిపోయినట్టే లెక్క. నాకు సంతోషం అక్కర్లేదు. నా భర్త లేకపోతే నాకు స్వర్గం అక్కర్లేదు. నా భర్త లేకపోతే నాకు సౌందర్యం అక్కర్లేదు. నా భర్త లేకపోతే నేను బ్రతుకకూడదని నిర్ణయించుకున్నాను."

మృత్యుదేవుడైన యముడు దేనికీలొంగని ఆమె ప్రేమ శక్తి వల్ల పరాజితుడైనాడు. సత్యవంతుడి ప్రాణాన్ని ఆమెకు తిరిగి ఇచ్చివేశాడు.

భారతీయ సాహిత్యంలో ప్రేమ విజయాన్ని వర్ణించిన కథలెన్నో వున్నాయి. ప్రాచీన నాటకాన్ని ఉదాహరణగా తీసుకుందాం. భాసుడి 'స్వప్న వాసవదత్త', 'ప్రతిజ్ఞా యౌగంధరాయణం'; హర్షుడి 'ప్రియదర్శిక', 'రత్నావళి'; శూద్రకుడి 'మృచ్ఛకటికం'; కాళిదాసు 'శాకుంతలం' మొదలైన ఎన్నో నాటకాలలో ప్రేమ ఎన్నో కష్టాల నెదుర్కొని జయిస్తుంది. భవభూతి 'మాలతీమాధవం', 'మహావీర చరిత', 'ఉత్తర రామచరిత' అనే మూడు నాటకాలు మూడు రకాల కథలు. చివరి రెండు రామాయణం వల్ల ఉత్తేజితమైనవి. ఈ మూడు నాటకాల్లోను ప్రేమ జయిస్తుంది.

వచన సాహిత్యంలో దండి 'దశకుమార చరిత్ర' గొప్ప వచన కావ్యం. గట్టిగా చెప్పాలంటే ఇది ప్రేమ కథకాదు. అయినప్పటికి అందులో విషాదం లేదు. బాణుడి 'కాదంబరి', సుబంధు 'వాసవదత్త' సంతోషాత్మక ప్రేమకథలు.

ఇక కవిత్వంలోకి వస్తే బిల్హణుడి 'చౌరపంచాశిక'లో రాజ కుమార్తెను ప్రేమించినందుకు మృత్యుదండన నెదుర్కొనే సందర్భంలో ఆ పురుషుడు ఉరికంబం దగ్గరికి వెడుతూ ఒక్కొక్క మెట్టు నెక్కుతూ శ్లోకంలోని ఒక్కొక్క పాదాన్ని ఉచ్ఛరిస్తాడు. ఆఖరి క్షణాల్లో రాజు అతణ్ణి క్షమిస్తాడు. 'బిల్హణ పంచాస్త ప్రత్యుత్తరం'లో రాజకుమార్తె ఉరికంబాన్నెక్కబోతున్న తన ప్రియుడి కొరకు యాభై వొక్క పద్యాల్లో ప్రత్యుత్తరాలిస్తుంది. అందులో తమను క్షమించక పోతే ఆత్మహత్య చేసుకుంటానని తండ్రిని బెదిరిస్తుంది. ఇందులోను ప్రేమ మృత్యువును జయిస్తుంది.

మృత్యువును జయించే ప్రేమను మీరాబాయి తన ఆత్మ ప్రభువైన కృష్ణుడికి నివేదించుకుంటుంది. మహాభారతానికి సంబంధించినవికాని ఈ విషయాలనన్నింటినీ ఉటంకిస్తున్నందుకు మన్నించండి. సంస్కృత సాహిత్యంలోని చాలా సందర్భాలలో కథలు సుఖాంతమౌతాయి. అయితే ఎక్కువ పాశ్చాత్య గ్రంథాలలో మృత్యువు ప్రేమను జయిస్తుంది.

పాశ్చాత్య పురాణం 'ఇలియడ్' గాని, 'ఒడెస్సీ' గాని, గ్రీకు విషాదాంత నాటకాల్లోగాని ఎన్నో ప్రేమ కథలున్నాయి. అవి ఎలా ప్రారంభమౌతాయో, ఎలా అంతమౌతాయో మనకు తెలుసు. యూరిపిడిస్ 'మిడీ'లో ఆమె జాసన్ ప్రేమకోసం తన పిల్లల్ని, తన శత్రువునీ, ఆమె తండ్రినీ చంపుతుంది. సోఫోక్లిజ్, 'ఈడిపస్'లో ప్రధాన పాత్ర తండ్రిని చంపి, తల్లితో సంగమిస్తుంది. ఈకిలస్ 'ఆగమెమ్నాన్'లో నీతి బాహ్యమైన ప్రేమ ఆమెచేత భర్తను చంపిస్తుంది.

క్రీ.శ. అయిదు, ఆరు శతాబ్దాలకు చెందిన గ్రమ్మాటికస్ రచన "హీరో అండ్ లియాండర్'లో ప్రేమికులిద్దరూ మరణిస్తారు. ప్రసిద్ధ పాశ్చాత్య నాటకకర్త షెక్స్పియర్ ప్రేమ మీద ఎన్నో నాటకాలను వ్రాశాడు. 'రోమియో జూలియట్' నాటకంలో ప్రేమికులిద్దరూ మరణిస్తారు. 'ఒథెల్లో' నాటకంలో డెజ్డమోనాను గ్రుడ్డిగా ప్రేమించిన మూర్ అసూయ వల్ల ఆమెను చంపివేస్తాడు. 'మాక్బెత్' నాటకంలో అత్యాశ ప్రేమ వారిని కలుపుతుంది. ఫలితం - వారి రాజు డంకన్‌తో సహా మరెందరినో హత్య చేయడం. 'టైటస్ ఆండ్రోనికస్'లో టైటస్ కుమార్తె తన ప్రియుడి కోసం రాజును నిరాకరిస్తుంది. అందువల్ల ఎన్నో హత్యలు, మానభంగాలు.

స్పానిష్ మహా కావ్యాలను పరిశీలిస్తే 15వ శతాబ్దానికి చెందిన ఫెర్నాండో డిరోజాస్ రచించిన విషాదాత్మక హాస్య నాటకం 'డికాలిక్టా బ్రయ్ మెలిబి'లో ప్రేమికులిద్దరూ మరణిస్తారు. లోప్ డి వేగాస్ రచించిన 'ఎల్‌కా బల్హెరోడి ఒల్మేడో' లో పెద్దమనిషి హత్యతో ప్రేమ ఔన్నత్యాన్ని పొందుతుంది. 'ఎల్‌కాస్టిగ్ సిన్ ల్యుగాంజా'లోని ప్రేమికులిద్దరూ చనిపోతారు. ప్రాచీన ఫ్రెంచి నాటక కర్త జీన్

రేసిన్ రచించిన 'ఆంద్రోమాక్' అందరి మరణంతో అంతమౌంతుంది. 'బజాజెట్'లో మృత్యువే ప్రేమను జయిస్తుంది. ఇలా చెప్పుకుంటూపోతే ఇది చాలా పెద్ద పట్టికే అవుతుంది. సారాంశం ఏమిటంటే పాశ్చాత్య సాహిత్యంలోని ప్రేమకథలు మృత్యువుతో అంతమౌతాయి.

జర్మన్ రచయిత గొథె రచించిన నాటకం 'స్టెల్లా'లోని నమ్మశక్యం కాని ఉదాహరణ - ఆ నాటకంలో కాసిల్లే అనే మహిళ లూసీ అనే తన కూతురితో బాటు జమీందారిణి స్టెల్లాకు చెలికత్తెగా వుండేందుకు వెడుతుంది. ఆమె కాసిల్లేకు స్నేహితురాలౌతుంది. ఆమెను అదివరకు భర్త ఫెర్డినాండ్ వొదిలేశాడు. మిత్రురాళ్ళిద్దరూ కాసిల్లాను వొదిలి వేసిన లూసీ తండ్రి అతడేనని తెలుసుకుంటారు. అతడే జమీందారిణి స్టెల్లా ప్రియుడు. ఆ నాటకం మొదటి ప్రతిలో కసిల్లా ఫెర్డినాండ్, స్టెల్లాల బంధాన్ని అంగీకరిస్తుంది. వారికి స్నేహితురాలిగా, ఆంతరంగిక చెలికత్తెగా మిగిలి పోతుంది.

మొదటి రాత్రి ఈ నాటకం ప్రేక్షకుల గందరగోళంతో, విధ్వంసకాండతో ముగిసింది. కొత్త నాటకంలో గొథె బలవంతంగా స్టెల్లాను విషం మింగేట్టుగా, ఫెర్డినాండ్ పిస్టలుతో తనని తానే అంతం చేసుకున్నట్టుగా మార్చాడు. ప్రేమికులిద్దరూ న్యూనతాభావంతో చనిపోతారు. అప్పటికిగాని పాశ్చాత్య ప్రేక్షకులు సంతృప్తి పడలేదు.

ఆ రోజుల్లో మృత్యువు ప్రేమను జయించడమే ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించేది. అలాంటి ప్రేక్షకులు ద్రౌపదికీ పాండవులకూ మధ్య వున్న ప్రేమను ఎలా భావిస్తారు? అలాంటి ప్రేక్షకులకు అలాంటి ప్రేమే కాదు, అహింస అన్నా అర్థం కాదు, ఎందుకంటే వారు శాశ్వతంగా హింసతో జీవించడానికి అలవాటు పడ్డారు.

భారత దేశానికి కూడా కట్టుబాట్ల వల్ల, ఎన్నో సమస్యలున్నాయి. అయితే మృత్యువు కన్నా వేరైన ఎన్నో విధాలుగా తమ సమస్యలకు పరిష్కారాలను అన్వేషించారు. మన విశాల భారతదేశంలో హిమాచల్ ప్రదేశ్‌లో ఇప్పటికీ ఒక ప్రాంతం వుంది. అక్కడివారు తాము ద్రౌపదికి వారసులమని చెప్పుకుంటారు. అక్కడ భర్తలు సహోదరులైతే, ఒకే స్త్రీ ద్రౌపదిలాగ వారిని వివాహం చేసుకుంటుంది. ఇక్కడి ప్రజలు ఇతరుల సిద్ధాంతాలను, ఆలోచనలను గౌరవిస్తారు. అదే మహాభారతం బోధించిన గొప్ప పాఠం.

మహాభారతం కాలాన్ని గురించి తడమకుండా మహాభారతాన్ని గురించి మాట్లాడాము. వివిధ మహాభారత రచనల్ని మనం స్పృశింపలేదు. ఇవన్నీ ఎందరో చదవరులకు, ఔత్సాహికులకు రచనోత్సాహాన్నిచ్చాయి. అలాంటి వాటినన్నింటిని గురించి పూణెలోని భండార్కర్ ఓరియంటల్ రిసెర్చి ఇనిస్టిట్యూట్ జాగ్రత్తలు తీసుకుంది. వారి పరిశోధనలు, చర్చలు అన్నీ శాస్త్రపరంగా చాలా ఉపయోగకరమైనవి, కాని చదువరులకు, శ్రోతలకు అంతగా ఉపయోగపడవు. సామాన్య ప్రజలు మహాభారతాన్ని గౌరవిస్తారు, అభిమానిస్తారు, ఆనందిస్తారు. వారికి అందులోని ప్రధాన పాత్రలు, సంఘటనలు కంఠోపాఠంగా తెలుసును. అవి పాశ్చాత్య సాహితీ పిపాసులను కూడ ఆనందింపజేయలేవు. అందుకే నేను వాటి జోలికి పోలేదు.

మహాభారతాన్ని గురించిన ఉపన్యాసాన్ని ముగిస్తున్న నాకు మనం జీవించని ఆ యుగమంటే ఏదో సున్నితమైన తపన కలుగుతోంది. కనులు మూసుకుని కృష్ణద్వైపాయనుడు గణేశునికి పాండవుల కార్యకలాపాలను వివరిస్తున్నట్టుగా ఊహించుకుందాం.

*(Original Writer:* He presently holds the chair of Sanskrit literature at the Faculty of Philosophy and Letters of the National Autonomous University of Mexico and he is furthermore full-time researcher at the Institute of Philological Research at the same University

# కనువిందు చేసే నవీన ఉషోదయం - ఆర్ట్‌నోవో

- కాంద్రేగుల నాగేశ్వరరావు

'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం'' నినాదంతో ప్రపంచ మానవాళి తరుపున శంఖారావం పూరించిన ఫ్రెంచి విప్లవంతో మానవజాతి చరిత్రలో ఒక మహోజ్వలమయిన అధ్యాయం ప్రారంభమయింది. అదే సమయంలో, ఆ సమరోత్సాహంలో, విచక్షణ కోల్పోయిన కొందరు, రాజరికం పై నున్న ద్వేషంతో రాజవంశీకులునే గాక వారిపై విశేషంగా ఆధారపడి జీవించిన కళాకారులు, చేతి వృత్తి నిపుణలపై కూడా బహిష్కరణ వేటు విధించారు. పిడుగుల జడివానగా సాగిన ఆ దహన కాండలో కొందరు సమిధలయితే, మరికొందరు ప్రాణరక్షణార్థం బ్రతుకు జీవుడా అంటూ ఇతర దేశాలకు పారిపోయారు. ఒక వ్యవస్థకు సంబంధించిన వారందరనీ దోపిడీ దారులుగా భావించటమే కాక, ఆ వ్యవస్థలో ఒక వెలుగు వెలిగిన కళాస్వరూపాలను, ముఖ్యంగా లూయిస్ చక్రవర్తుల వారసత్వంగా వచ్చిన చిత్రాలను, శిల్పాలను ధ్వంసం చేసి విప్లవకారులు తమ అక్కసు తీర్చుకొన్నారు. అనేక చిత్రాలను అగ్నికి ఆహుతి చేసి ఆ చిత్రాలకు ఫ్రేములలో వున్న బంగారపు తొడుగుల్ని కరిగించి ప్రజలు ఎక్కడికక్కడే పంచుకున్నారు.

ఒక అర్ధ శతాబ్దం పాటు, ఫ్రాన్స్ దేశంలో స్థిరత్వంలేని ప్రజాభీష్టం, విప్లవం, ప్రతి విప్లవం, రాజరికం, ప్రజాస్వామ్యం, తిరిగి రాజరికం ఇలా రకరకాల అలజడులతో సాంఘిక ప్రజా జీవితాన్ని అల్లకల్లోలంగా మార్చింది. ప్రశాంతత లోపించటంతో సృజనాత్మకమయిన కళలన్నీ మూలబడ్డాయి.

మూడవ నెపోలియన్ రాజ్యానికి వచ్చిన తరువాత శాంతి నెలకొల్పబడింది. అరాజకం సర్దుమణిగి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. (1852 నుంచి) ఫ్రెంచి దేశస్థులు విప్లవం ద్వారా ఏ రాచరిక వ్యవస్థను రూపు మాపాలనుకున్నారో తిరిగి దానినే పునఃప్రతిష్ఠించారు. దీనితో మళ్ళీ ఆడంబరాలు, విలాసవంతమైన జీవనం చోటుచేసుకున్నాయి. విశ్రాంతి తీసుకొంటున్న ప్రజలు వినోదాలను కోరుకున్నారు. మళ్ళీ కళాకారులు కావలసి వచ్చారు. విప్లవంతో నిర్లిప్తమైన కళారంగాన్ని తిరిగి చిగురింప చేయాలనుకున్నారు. నిజానికి ఈ భావనకు నాంది నెపోలియన్ బోనాపార్టీ రాజ్యానికి వచ్చినపుడే జరిగినా, పాత క్లాసికల్ సిద్ధాంతాలకు కట్టుబడిన ఒకరిద్దరు చిత్రకారులు, శిల్పులకు మాత్రమే రాజపోషణ లభించింది. నిరంతర సంగ్రామ శీలయిన బోనపార్టీ కళలను చావకుండా జీవింప చేయగలిగాడు గాని పూర్తిగా పునరుద్ధరించలేక పోయాడు. మూడవ నెపోలియన్ కాలంలో కళలు అతివేగంగా పునరుద్ధరించబడ్డాయి. దీనికి అనేక కారణాలున్నాయి.

ఇందులో మొట్టమొదటిది అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్న శాస్త్రీయ విజ్ఞానం, దానితో ముడిపడి ఉన్న పారిశ్రామిక విప్లవం,.రెండవది ప్రజాస్వామ్యపు ఆలోచనలతో (దీనికి ఆనాటి సమకాలీన సాహిత్యం చాలా ఉపయోగపడింది) రాజకీయంగా పరిణితి చెంది, సాంఘికంగా, ఆర్థికంగా పెరుగుతున్న మధ్యతరగతి ప్రజా బాహుళ్యం, తమ ముందు తరం వారికంటే వీరి కొనుగోలు శక్తి పెరిగింది. వినియోగ వస్తువులను కోరుకునే వారు ఎక్కువైనారు. ఒకనాటి భోగ వస్తువులు నిత్యావసర వస్తువులైనాయి. మునుపటిలా ఒకే వస్తువుపై నెలలు, సంవత్సరాల తరబడి పనిచేసే అత్యంత ప్రతిభావంతుల స్థానంలో, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఇంచుమించు అదే నాణ్యతతో వస్తువులను తీసుకొని రావడానికి పారిశ్రామీకరణ దోహదం చేసింది. అయితే

కాంద్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ శాఖలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

ఇవి ఒకనాటి నిర్దుష్టం కళాస్వరూపాలు కావు. విపరీతమైన అలంకరీకరణకు, సాధారణతకు మధ్య అనుసంధానం చేయబడిన ఈ నవీన కళాధోరణికి 'ఆర్ట్‌నోవో' అనిపేరు. జర్మనీలో దీనిని Jugendstil గా పిలిచేవారు. ఈ కళా స్వరూపాలు మౌళికంగా కర్మాగారాలలో తయారు చేయబడినా, అక్కడ నుండి యథాతథంగా విపణి వీధిలోకి తీసుకొని రాబడలేదు. దీనికి కొందరు కళాకారులు, చేతి వృత్తి పని వారలు మరికొంత నగిషీలు చెక్కి దీనిని నిర్దిష్టమైన రూపురేఖలతో అలంకార ప్రాయంగా అందంగా తీర్చిదిద్ది కళా స్వరూపాలుగా వినియోగదారులకు చేర్చేవారు. పెరిగిపోతున్న పారిశ్రామీకరణతో, ఉపయోగమే ముఖ్యంగా సాధారణ వినియోగ వస్తువులయిన దువ్వెన, కత్తెర వంటివి ఆర్ట్‌నోవోలో ఒక కొంగ్రొత్త అందాలతో భాసించాయి. ఇంతవరకూ ఏ కళాకారుని దృష్టిని ఆకర్షించని క్రిమికీటకాదులయిన తూనీగలు, తుమ్మెదలు, సీతాకోక చిలుకలు ఈ నవీన కళా ప్రక్రియలో ముఖ్యమయిన ప్రతీకలుగా నిలబడ్డాయి. వీటి రూపంలో కళా సౌజన్యం పొందిన చెంప పిన్నులు, పైట పిన్నులు లాంటి కొత్త నగలు, డిజైనులు, బహుళ ప్రజాదరణకు నోచుకున్నాయి. ప్రజలు వీటిని కొనడానికి ఎగబడేవారు.

అయితే దీని వెనుక నున్న కళా సిద్ధాంతాలను చర్చించబోయే ముందు, మనం చరిత్ర నొకసారి పరిశీలించవలసివుంది.

400 సంవత్సరాల పూర్వం జపాన్ దేశానికి అతిథులుగా వచ్చిన ఫ్రెంచి, స్పెయిన్ దేశస్థులు క్రైస్తవ మతాన్ని జపాన్ దేశంలో ప్రచారం చేయటం ప్రారంభించారు. ఈ మత మార్పుడులను ఇష్టపడని జపాన్ రాజు 1657వ సంవత్సరంలో జపాన్ దేశం నుంచి ముందు మతాధిపతులను, తరువాత విదేశీ వ్యాపారస్థులను బయటకు పంపించటమే కాకుండా, జపనీయులెవ్వరూ, ఇతర దేశాలకు వెళ్ళకూడదనే కట్టడి చేశాడు. అయితే అంతకు 8 సంవత్సరాలు ముందు వచ్చిన డచ్ దేశస్థులు మత మార్పిడులలో కలగ జేసుకొనక పోవటంతో వారికి మినహాయింపు ఇవ్వబడింది. 1657వ సంవత్సరం తరువాత మరో వంద సంవత్సరాల వరకూ, ఐరోపా ఖండానికి, జపాను దేశానికి మధ్య డచ్చివారి ద్వారా తప్ప మరొక రకంగా సంబంధం లేకుండా పోయింది. ప్రసిద్ధి కాంచిన జపనీయుల పింగాణీ వస్తువులు, లక్క రంగులు డచ్చి దేశస్థుల ద్వారా మాత్రమే ఐరోపా ఖండానికి పంపిణీ జరిగేవి. 'దేసిమా' అనబడే జపాన్ దీవి నుండి మాత్రమే డచ్చివారు తమ కార్యకలాపాలను సాగించుకొనేవారు. జపనీయుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే వ్యాపార లావా దేవీలు జరిగేవి.

ఆ రోజులలో అమెరికా, ఇంగ్లండ్, రష్యా దేశస్థులు జపాన్ దేశంతో సాంస్కృతిక పరమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలని చూసినా, ఎందుకో జపనీయుల మనస్సును ఆకర్షింప లేకపోయారు. ఫ్రెంచి విప్లవం తరువాత ఫ్రెంచివారు నెమ్మదిగా జపనీయులను ఆకట్టుకొని పింగాణీకి సంబంధించిన కొంత వ్యాపారం తమ చేతుల్లోకి తీసుకోవటమే కాక తమ దేశంలో జపనీయులను వ్యాపారం చేయడానికి అనుమతించారు. నౌకా నిర్మాణం, ఉక్కు పరిశ్రమలలో జపనీయులకు ప్రవేశం కల్పించారు. ఐరోపా వాసులకు జపాన్ కళ గురించి పరిచయమైతే జరిగింది కానీ, చైనా, జపాన్ కళారూపాల మధ్యనున్న సూక్ష్మమైన తేడాలను గుర్తించలేకపోయేవారు. ఫ్రెంచి దేశంలో స్థిరపడిన తరువాత జపాన్ దేశీయులు అద్దకం చేయబడ్డ, అల్లిక కాబడ్డ గుడ్డలను అమ్మకం చేసేవారు. దీంతో బాటుగా కుంచెతో పట్టు వస్త్రాలపై చిత్రించబడ్డ జపనీయ చిత్రాలపట్ల ఐరోపా

వాసులు విపరీతమైన మోజు పెంచుకున్నారు. అంతవరకూ తమ కళారూపాలే ప్రపంచంలో అద్వితీయమైనవని భావించిన ఐరోపా దేశస్థులు, జపనీయ కళల పట్లనే కాక తూర్పుదేశాలలోని కళారూపాలను కూడా చూడాలని ఉవ్విళ్ళూరారు. అర్థం చేసుకొనే ప్రక్రియ మొదలయింది. పునర్వికాస దశలో ఉద్భవించిన అన్ని చిత్రాలలోనూ కనిపించే కుడి యెడమల సమతూకం జపాన్ చిత్రాలలో లేకపోవటం, అవి లేకపోయినా, ఒక అస్పష్టమైన సమతూకంతో చిత్రాలను సౌందర్యవంతంగా, కంటికింపుగా చేయవచ్చుననే విషయాన్ని కొత్తగా ఆకళింపు చేసుకున్నారు. ఒక నూతన దృష్టిని అలవరచుకున్నారు. ఆర్ట్‌నోవో శైలిలో చిత్రించబడ్డ చిత్రాలూ, శిల్పాలు, ఫర్నీచరు మొదలైన వాటన్నిటిలోనూ ఒక అసమానమైన సమతూకాన్ని సాధించారు. ఇదే ఆర్ట్‌నోవో ప్రత్యేకతగా ఆవిష్కరించబడింది.

ఆర్ట్‌నోవో శైలి సాంప్రదాయానికి భిన్నంగా, ఉపయోగమే ప్రధాన అంశంగా రూపు దిద్దుకొన్న కళ. వాటిలో నూనెరంగు చిత్రాలు, శిల్పాలు, నగలు, ఫర్నీచరు, గాజు, పింగాణీతో చేసే వస్తువులు, వంట గదిలో ఉపయోగించే వంట సామగ్రి, గృహోపకరణాలు, కిటికీలు, ద్వార బందాలు, పూల సజ్జలు, ఫోటోఫ్రేములు, ఆష్‌ట్రేలు, అది, ఇది అని కాదు, దైనందిన జీవితంలో వాడబడే ప్రతి వస్తువూ ఒక కళాఖండంగా రూపుదిద్దుకొంది. ఇంటి గోడలకు అటించబడే రంగు రంగుల కాగితాలు, గోడలపై అంటించబడ్డ ప్రకటన పత్రాలు అన్నీ ఒకొక్కటిగా తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. ఐరోపా వాసులు తమకు తెలీయకుండా తూర్పు దేశపు, ముఖ్యంగా జపనీయుల, జావా దేశస్థుల ప్రాచీన శైలులను తమ కళలలో జీర్ణం చేసుకున్నారు. ప్రాక్ పశ్చిమాల సంగమ దశ అది.

ఇదే సమయంలో నిశీధ తిమిరాలను ఫటాపంచలు చేస్తూ విద్యుద్దీకరణ మానవ శాస్త్రీయ ప్రగతిని మరో ముందడుగు వేయించింది. అంత వరకూ కొవ్వొత్తి దీపాలతో నిండిన షాండ్లియర్ వెలుతురు కంటే కొన్ని రెట్లు అధికమైన కాంతితో ఇంటిలోని గదులన్నీ కాంతిని ప్రసరించాయి. నూనె రంగుల చిత్రాలను రాత్రిపూట కూడా స్పష్టంగా చూసే వీలుకలిగింది. దీనితో నూనె రంగుల చిత్రాలు అనేక నూతన పోకడలు పోయాయి. చిత్రాలలోని మారు మూలలు కూడా దేదీప్యమానంగా కనిపించే కాంతి పుంజం లాంటి ఇంప్రషనిజం లాంటి ధోరణులు ప్రారంభమయినాయి.

గోడమీద అంటించే ప్రకటన పత్రాలు అంతవరకూ చెక్కమీద చెక్కబడిన ఒక నమూనా ఆధారంగా ముద్రించబడేది. ఈచెక్క నమూనా కొంతకాలం తరువాత, కొన్ని అచ్చు ప్రతీకలు వేసిన తరువాత అంచులు అరిగిపోయి, నాణ్యతను పోగొట్టుకొనేవి, ఆర్ట్‌నోవోలో ఈ చెక్కస్థానం అల్యూమినియం లాంటి లోహం ఆక్రమించి ఆ లోపాన్ని సవరించింది. నాణ్యత ఏ మాత్రం లోపించకుండా, త్వరితగతిని ఒక లక్ష కాపీలను సునాయసంగా అచ్చువేసే సౌలభ్యం కలిగించింది. ఆనాటి ఆ ప్రకటనా పత్రాలలో జపాన్, జావా దేశాల శైలులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

1900 సంవత్సరానికి 20 సంవత్సరాలు అటు, ఇటుగా ఆర్ట్‌నోవో ప్రభ అవిచ్ఛిన్నంగా కొనసాగింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఈ శైలి కనుమరుగు కాకపోయినా తన ప్రాభల్యాన్ని పోగొట్టుకుంది. విద్యుత్ కాంతితో ఉండే టేబుల్ దీపాలలో ఆర్ట్‌నోవో శైలిలో ఉన్న వస్తువులు ఇప్పటికీ అత్యధిక ధరలకు అమ్ముడు పోతున్నాయి.

19వ శతాబ్దపు అందచందాలను, తూర్పు పశ్చిమ దేశాల శైలితో రంగరించబడిన ఆర్ట్‌నోవో అమెరికా, ఇంగ్లండ్, బెల్జియం, ఇటలీ దేశాలలో "స్టైల్ మోడరన్" అనే పేరుతో పిలువబడింది.

ఈనాటికీ అనేకానేక దేశాలలో స్త్రీల సంబంధమైన అలంకరణ సామగ్రిని అమ్మే దుకాణాలు, కొంగ్రొత్త పోకడలను అలరించే షాపులు, ఇదే శైలిలో కొనసాగుతున్నాయి. పూర్వపు రోజులలో నూనెరంగు చిత్రాలు, పాలరాతి శిల్పాలు మున్నగునవి మాత్రమే ఆయా కళాకారుల పేరుతో చెలామణి అయ్యేవి. ఆర్ట్‌నోవో ఈ పరిధిని మరింత విస్తృతపరచి కళాత్మకమైన ప్రతి వస్తువు దానిని సృష్టించిన వ్యక్తి పేరుతో చెలామణి అయ్యింది. చేతి పని వారలకు, కొన్ని కర్మాగారాలకు ఒక ప్రత్యేకతను, గుర్తింపును తెచ్చింది.

అంతవరకూ కళాకారుడు, వృత్తి పనివారలు వేర్వేరు తరగతులుగా విభజింపబడి ఉండేవారు. ఆర్ట్‌నోవోతో 'కళాకారుడయిన వృత్తి పనివాడనే' కొత్త తరగతి ఉద్భవించింది. మతపరమైన ఏ చిహ్నాలూ వాడకపోవటం దీని ప్రత్యేకత మతానికి దూరంగా, సౌందర్య దృష్టే ప్రదానంగా ప్రవంతది. ఈ కళ ఏ బడిలోనూ, కాలేజీలోనూ అకడమిక్‌గా చెప్పబడలేదు. ఈ కళ కర్మాగారంలో జన్మించి, కళాకారుని ఒడిలో వృద్ధి పొందింది. ఆర్ట్‌నోవో ఆవిర్భవించిన తరువాతనే గృహోపలంకరణ ఒక కళగా గుర్తించబడింది. ఆర్ట్‌నోవోకు పూర్వం ఏ రూపంలో వున్న కళా ప్రక్రియైనా సరే కేవలం రాజులు, కులీనులను మాత్రమే అలరింపజేసే ఒక ప్రక్రియగా వుండేది. 90 శాతం మంది సామాన్య ప్రజలకు కళ ఒక అందని ద్రాక్ష. చర్చిలో ప్రవేశించినపుడు గోడల మీద కనిపించే చిత్తరవులు (Fresco) తప్ప నిజ జీవితంలో కళాకృతులను చూడటమంటే ఒక గగన కుసుమాన్ని వీక్షించటమే.

ఫ్రెంచి విప్లవం కేవలం ఫ్రెంచి ప్రజలనే కాదు, ఐరోపా దేశంలోని మేధావులను, కవులను (ముఖ్యంగా Words Worth, Milton లను) ప్రజలను ఆకర్షింపజేసి ఆలోచింపజేసింది. ఐరోపా ఖండం ప్రజాస్వామ్యం వైపు నడక సాగించింది. కొన్ని దేశాలలో రాజులు, రాజరికం తొలగించబడక పోయినా 'నా విష్ణుః పృథ్వీపతిః' అన్న భావం మరుగున పడింది. సామాన్య మానవుడు తన కొక మూర్తిమత్వం, వ్యక్తిత్వం ఉన్నాయని గుర్తించాడు. సామాన్య ప్రజ దీర్ఘ నిద్ర నుండి మేల్కొంది. సామాన్యుడు కూడ తన కున్న కళాభిరుచికి తగినట్లు కొన్ని వస్తువులను కొనుగోలు చేసుకోవటం ప్రారంభించాడు. మిలియమ్ మెరిస్ అనే చిత్రకారుడు, చరిత్రకారుడు, ఆర్ట్‌నోవోను "కొద్దిగా సహజత్వం, కొద్దిగా కల్పన, కొద్దిగా సింబాలిజం, మరి కొద్దిగా ఆధునికమైన శైలితో కలసిన ఒక మిశ్రమ ప్రక్రియగా భావించాడు."

సామాన్యుని జీవితాల్లోకి చొచ్చుకొని పోయి వాళ్ళ జీవితంలో కళా శోభను నింపిన మొట్టమొదటి కళాప్రక్రియ ఆర్ట్‌నోవో.

ఈ నెల 'మిసిమి' ముఖచిత్ర వివరణ: లూయిస్ అచ్చేమా చిత్రకారుడేకాదు. వృత్తి నైపుణ్యం కూడా కలవాడు. ఒక స్త్రీ చిత్రాన్ని అంతకు పూర్వపు శైలికి భిన్నంగా తేలికపాటి రంగులను ఉపయోగించటమే కాక కోలాకారంలో ఉన్న ఈ చిత్రం చుట్టూ ఫ్రేమును దాని ప్రక్కనున్న స్త్రీ మూర్తులను నిలిపాడు. నూనె రంగుల చిత్రం కళాకారునిగా అతని ప్రతిభను చాటితే దాని చుట్టూ వున్న ఫ్రేము మొదట కర్మాగారంలో తయారై, తరువాత కళాకారుని చేతిలో నగిషీ చెక్కబడి రంగులు వేయబడింది. ఒకవైపున వున్న సాలభంజికకు మరొక వైపునున్న సాలభంజికల భంగిమలు వేర్వేరుగా ఉండడం గమనించాలి. ఐరోపా కళలో నున్న కుడి యెడమల సామ్యం (Symmetry) ఆర్ట్‌నోవో కళలో మార్చబడింది. ఇది జపనీయుల కళనుంచి ఆర్ట్‌నోవో కళాకారులు పొందిన ఉత్తేజం.

# తెలుగు వేమన వెలుగులోకి ఎలా వచ్చాడు?

- కె. జితేంద్రబాబు

తెలుగు సాహిత్య చరిత్రను గమనించినట్లయితే, అది అంతా కూడా సంస్కృత అనువాద, అనుసరణ, అనుకరణలతోనే ప్రారంభమైంది. తెలుగులో ఆది కావ్యంగా పేర్కొంటున్న ఆంధ్ర మహాభారతానువాదము సంస్కృత మూలాన్ని అనుసరిస్తూనే సాగింది. భారతంను ఆంధ్రీకరించిన వారి కవితా విహంగము కొన్ని చోట్ల రెక్కలు విప్పినా దాని కథార్థమును మార్చలేదు. నన్నెచోడుని కుమార సంభవము తెలుగులో రచింపబడిన మొదటి ప్రబంధమైనను అనువాదమే. శృంగార వీర రసాలే ఈ గ్రంథంలో ప్రధానంగా చూపబడినాయి గాని సమాజంగాదు. తదనంతర సాహిత్యం అంతాగూడా ప్రబంధ పక్కి, పురాణముల నుండి ఇతివృత్తాలను గ్రహించి, నవరసములతో, అష్టాదశ వర్ణనలతో, అలంకారాలతో కావ్యాలను రచించుటే సాహిత్య సంప్రదాయంగా కొనసాగింది. వస్తువులో స్వతంత్రత లేదు. భక్తి భావ తరంగాలు సాహిత్యంలో ప్రవేశించి కొన్ని కొత్త ప్రక్రియలను సృష్టించినప్పటికి వాస్తవికతలేదు.

సమకాలీన సమాజాన్ని తొలిసారిగా తన ప్రతిభతో సాహిత్యంలో చూపించడమే గాక మతరాహిత్యాన్ని, కులరాహిత్యాన్ని కోరుతూ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అసమానతల మూలాలను తొలిసారిగా ప్రశ్నించిన విప్లవోద్యమ వేగుచుక్క వేమన. మనిషి జీవితంలో మానవత్వాన్ని మసి చేసే మత మౌఢ్యాన్ని, తద్వారా ప్రవేశించిన, యజ్ఞ యాగాలను, కర్మకాండను, విగ్రహారాధనను, కులాధిపత్యాన్ని, ఎండగట్టి సాహిత్యాన్ని మానవ జాతి చైతన్యంగా మార్చిన తొలి తెలుగు కవి వేమన. తన సమకాలీన డంభపు జీవనాన్ని, విశృంఖలత్వాన్ని, దొంగ భక్తిని, నంగి పూజలను, అసమానతలను, ఆధిపత్యాన్ని, రుగ్మతలను ప్రశ్నిస్తూ సామాజిక చైతన్యానికి కవిత్వాన్ని ఆయుధంగా వాడిన తొలి తెలుగు కవి వేమన. "తోటకూరకైన, దొగ్గలికైనను, దవిటి కూరకైన, తవిటికైన కావ్యములను చెప్పు" కవులున్న కాలంలో, కవులు రాజాశ్రయులై ఊడిగం చేస్తున్నపుడు, సమాజాన్ని సామాన్య జనాన్నీ విస్మరించి ఊహాలోకాల్లో విహరిస్తూ ఉంపుడు కత్తెలపై కావ్యాలు రాస్తున్న సమయంలో తెలుగు నానుడులతో తెలుగు వారి నోళ్ళలో నిలచిన తొలి తెలుగు కవి వేమన.

పాండిత్యం కోసం పండితుల ముందు మోకరిల్లలేదు. వ్యక్తిత్వం విలక్షణమైంది కాబట్టి కవిత్వాన్ని జీవిత సత్యానికి వ్యాఖ్యానంగా భావించాడు. జీవిత సత్యాలు వేమనను వైరాగ్యంవైపు నడిపించకుండా చైతన్యం వైపు నడిపించాయి. సంఘర్షణ వైపు నడిపించాయి. నిర్మోహమాటంగా ప్రశ్నించటం నేర్పాయి. వేమన కొందరు భ్రమించినట్లు అద్వైతి కాడు, వీరశైవుడు కాడు, నాథకవి, యోగకవి, అచల కవి కాడు. వేమన సహజ కవి. సమాజకవి. పద్యాన్ని పదంగా మార్చిన కవి. పదంను పద్యంగా మార్చిన కవి. వేమన్నను కవి కాదన్న పండిత లోకాన్ని మూడు పంక్తులతో ముచ్చెమటలు పోయించిన కవి. ఆట వెలదికి పాట లక్షణం వుందని, పద్యం ద్వారా సూచించటం వల్ల వేమన సాహిత్యాన్ని ప్రజలు మౌఖిక సాహిత్యంగా బతికించుకొన్నారు. పండిత లోకం వేమన సాహిత్యాన్ని, జీవితాన్ని గందర గోళం చేసినా కూడా వేమన కవితాత్మ నిలచే వుంది. ఆయన తాత్విక సంపద ప్రశ్నిస్తూనే వుంది.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో వేమన తాత్విక దృక్పథాన్ని తప్పుద్రోవ పట్టించే పద్యాలెన్నింటినో పండిత లోకం సృష్టించింది. కవితా సౌందర్యాన్ని కొంచపరచే, కించపరచే రచనలూ పండిత లోకం సృష్టించింది. వేమన పద్యాలకు శుద్ధమైన ప్రతులు లభ్యమవక పోవుట వలన ఏరివేత విజ్ఞులకే సాధ్యంగాని విధంగా

---

కె. జితేంద్రబాబు, ప్రముఖ సాహితీవేత్త, చరిత్ర పరిశోధకులు, హైదరాబాద్.

పద్యాలను చొప్పించి వేమన పేరుతో ప్రచారంచేసారు. దీనితో వేమన జీవితాన్ని గూర్చి విశ్వసనీయ సమాచారం సేకరించడం కష్టతరమైంది. వేమన కవిత్వంలో ఆయన జీవితాన్ని గూర్చి సమాచారం తక్కువ. చారిత్రక ఆధారాల కంటే కథలు కల్పనలే ఎక్కువగా ప్రచారం అయినాయి. వేమన సమకాలికులు గాని, అనంతరీకులు గాని ఆయనను గూర్చిన ఏ ప్రస్తావనను రచనలలో చేయలేదు. వేమన కూడా సమకాలీన సమాజానికి చెందిన ప్రఖ్యాత వ్యక్తుల ప్రస్తావనను గాని, సమకాలీన సంఘటనల వివరాలను గాని, తన పద్యాలలో ప్రస్తావించలేదు. తన సమకాలీన సమాజ సంఘటనలను ప్రస్తావించక పోయినా విశ్వజనీనమైన భావాల్ని పద్యాల్లో పొందుపరిచాడు. ప్రవృత్తిలో, ప్రబోధంలో, ప్రవర్తనలో సమకాలీన కవులకు భిన్నంగా వ్యవహరించటం వల్ల వేమన గురించి విపరీత కల్పనలను, గాథలను ప్రచారం చేసారు. ఈ తెర తొలిగించి చారిత్రక దృష్టితో వేమనను ఆవిష్కరించటం కష్ట సాధ్యమైన పని.

వేమన జీవితానికి సంబంధించిన కథలను, గాథలను తొలి సారిగా గ్రంథస్తం చేసిన వారు మచిలీపట్టణానికి చెందిన ఆర్. పూర్ణయాచార్యులు. వేమన పేరుతో చలామణిలో ఉన్న పద్యాలను కూడా సేకరించి 4,305 పద్యాలతో 1913వ సంవత్సరంలో "వేమన సూక్తి రత్నాకరం" అను పేరుతో ఒక గ్రంథం ప్రచురించారు. ఈ గ్రంథంలో వేమన జీవితానికి సంబంధించిన నాలుగు కథలను సేకరించి గ్రంథస్తం చేసాడు. వీటిలో చారిత్రక వాస్తవికతలేదు. తదనంతరం వేమనపై, వేమన పద్య గ్రంథాలు కలిపి దాదాపు 150 గ్రంథాలు ప్రచురింపబడినాయి. 100పై చిలుకు వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురించినారు. చారిత్రక దృష్టితో పరిశీలిస్తే ఈ గ్రంథాల్లో వేమన జీవిత కాలాలను గూర్చి చేసిన నిర్ణయాలు ఏవీ నిలబడవు.

వేమన ఎలా వెలుగులోనికి వచ్చాడో మరొక్కసారి పరిశీలించాల్సి వుంది. ఆ వివరాలు తెలిస్తే పండితలోకం వేమన జీవితాన్ని ఎలా వక్రీకరించిందో తెలుస్తుంది.

వేమన రాసిన తెలుగు పద్యాలన్నీ ప్రాపంచిక విధానాలమీద, జీవన ప్రాముఖ్యం పైన, ప్రయోజనాలపైన, జీవితంలోని అర్థవంతమైన పాత్రను గూర్చి మాత్రమే ప్రతిధ్వనిస్తాయి గాని, సమకాలీన కాలాన్ని గుర్తుపట్టడానికి అవసరమైన ఆధారాలు ఇవ్వలేదు. కాని ఇండియాలో క్రైస్తవ మత ప్రచారకుడుగా క్రీ.శ. 1792 నుండి 1823 మధ్య కాలంలో ఉన్న Abbe. J.A. Dubois, అను ఫ్రెంచి మిషనరీ ఫ్రెంచి భాషలో (Moeurs, Institutions et Ceremonies des Peuples de l'Inde), అను గ్రంథమును రాసినాడు. మొదట ఈ గ్రంథం ఇంగ్లండ్‌లో 1816లో Description of the Character, Manners and Customs of the people of India, and their Institutions Religious and Civil, అను పేరుతో అనువాదమై ప్రచురించబడినది. ఈ గ్రంథంలో వేమన ప్రస్థావన లేదు. హిందువుల అలవాట్లు - ఆచారాలు పండుగలు (Hindu Manners, Customs and Ceremonies) అను పేరుతో Henry K. Beauchamp, అను అతను 1897లో ఆంగ్లంలోకి అనువదించాడు. అందులో వేమన చెప్పినట్లుగా పేర్కొంటూ "It is a water which causes mud, and it is water which removes it. It is your will that makes your cannit sin, and it is by your will alone that it can be purified'. పద్య భావాన్ని మొదట Henry K. Beauchamp తన అనువాదంలో ఉటంకించాడు. ఈ భావం గల పద్యం వేమన పద్య సంకలనాల్లో మాత్రం ఈనాడు లభ్యమవుట లేదు. ఈ గ్రంథ రచయిత గూర్చి ప్రఖ్యాత జర్మన్ పండితుడు F. Max Muller తను రాసిన ముందుమాటలో విష్ణు శర్మ రచించిన పంచతంత్రాన్ని కూడా Abbe Dubois అనువాదం చేసినట్లు పేర్కొన్నాడు. అతని గురించి తెలుపుతూ

The Abbe Dubois, though born about 1770 and therefore considerably the junior of Sir William Jones, belonged by his place in the history of Sanskrit scholarship to the period that came to an end with the beginnings of the Asiatic Society of Bengal, which had been founded by Sir William Jones in 1784. Nor must it be forgotten that while the real revival of Sanskrit studies took place in Bengal, the Abbe Dubois spent the whole of his life in the Dekhan and in the Madras Presidency. He was therefore, as may be seen by his translation of the Panchatantra, under the title of Le Panchatantra ou les cinq ruses, Fables due Brahme Vichnou-Sarma; Aventures de Paramarta et autres contes, le tout traduit pour la premiere fois, Paris, 1826, a Tamil far more than a Sanskrit scholar, and well acquainted with Tamil literature, which hitherto has been far too much neglected by students of Indian literature, philosophy, and religion. మైసూరు నందు బ్రిటీష్ రెసిడెంట్‌గా పనిచేసి మైసూరు చరిత్రను గ్రంథస్థం చేసిన ప్రఖ్యాత చరిత్రకారుడు Major Mark Wilks, పై గ్రంథానికి పరిచయం చేస్తూ "Of the history and character of the author, I only know that he escaped from one of the fusillades of the French Revolution and has since lived amongst the Hindus as one of themselves: and of the respect which his irresproachable conduct inspires, it may be sufficient to state that when travelling, on his approach to a village, the house of a Brahmin is uniformly cleared for his reception, without interference, and generally without communication to the officers of Government, as a spontaneous mark of deference and respect. అని రాసినాడు. Abbe Dubois మసూచి నివారణకు కూడా సహకరించినట్లు M. Launay తాను రాసిన 'Histoire des Missions' de l'Inde, అను గ్రంథంలో "Among other benefits which he conferred upon his flock, may be mentioned his zeal in establishing agricultural colonies, and also introducing vaccination to stay the ravages of small-pox; in which, in spite of the extraordinary tenacity of native prejudice, he succeeded so fully that in 1803-4 a total of 25,432 natives were vaccinated and registered; in memory of which the natives still remember him by the title of "Doddhaswa-miayavaru," or "Great Lord." అని తెలియజేసినారు.

"Hindu Manners, Customs and Ceremonies" గ్రంథం యొక్క లిఖిత ప్రతి 1806లో Major Wilks కు అందింది. ఒక సంవత్సర కాలం ఈ ప్రతిని అధ్యయనం చేసి సెంట్ జార్జి ఫోర్టు పరిపాలనా విభాగానికి స్వాధీనం చేస్తూ ఇలా రాసారు: "So for as my previous information and subsequent inquiry have enabled me to judge, it contains the most correct, comprehensive, and minute account extent in any European language of the customs and manners of the Hindus." సర్ జేమ్స్ మెకిన్‌టోష్ (Sir James Mackintosh) కూడా హృదయ పూర్వకంగా తన అభిప్రాయాన్ని లిఖిత ప్రతిపై తెలియజేశాడు. ఈస్టిండియా కంపెనీ రెండు వేల స్టార్ పగోడాలకు ఈ లిఖిత ప్రతిని కొనుగోలుచేసింది. ఆనాటి గవర్నర్ Lord William Bentinck ఈ గ్రంథం చదువుట కంపెనీ ఉద్యోగులకు లాభదాయకమనే అభిప్రాయాన్ని తెలుపుతూ "The result of my own observation during my residence in India is that the Europeans generally know little or nothing of the customs and manners of the Hindus. We are all acquainted with some prominent marks and facts, which all who run may read; but their manner of thinking, their domestic habits and ceremonies, in which circumstances a knowledge of the people consists is, I fear,

in great part wanting to us. We understand very imperfectly their language. They perhaps know more of ours; but their knowledge is by no means sufficiently extensive to give a description of subjects not easily represented by the insulated words in daily use. We do not, we cannot associate with the natives. We cannot see them in their houses and with their families. We are necessarily very much confined to our houses by the heat, all our wants and business which would create a greater intercourse with the natives is done for us and we are in fact strangers in the land. I have personally found the want of a work to which reference could be made for a just description of the native opinions and manners. I am of opinion that, in a political point of view. The information which the work of the Abbe Dubois has to impart might be of the greatest benefit in aiding the servants of the Government in conducting themselves more in unison with the customs and prejudices of the natives."

మద్రాసు పరిపాలనా విభాగము ఈ ప్రతిని కొన్ని విషయాన్ని బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు 1807లో తెలియజేసి అనువాదం చేసి ప్రచురించాలని ఒక ప్రతిని లండన్‌కు పంపించారు. ఈ ప్రతి 1816 వరకు అనువాదం చేసి ప్రచురించబడలేదు. ఈస్ట్ ఇండియా కంపెనీవారు ఆంగ్ల అనువాదాన్ని Major Mark Wilks, వ్యక్తిగత పర్యవేక్షణ కింద ప్రచురించారు. ఈలోపు దీని ప్రతిని సెంట్ జార్జి ఫోర్ట్‌లో వుండగా C.D. Campbell దృష్టిలో క్రీ.శ. 1815లో పడింది. అతను Local Board Examinations కు పర్యవేక్షనాధికారిగా వున్నారు. అతనికి ఈ ప్రతి అనువాదమునకు ఇంగ్లండు పంపిన విషయం తెలియక వెంటనే స్థానిక ప్రభుత్వానికి ఈ క్రింది విధంగా రిపోర్టు చేసాడు.

"I soon found enough to satisfy me that it would be unfair to proceed further in this pursuit without first affording the author our opportunity of revising his work, being convinced that the increased experience of the Abbe' Dubois and his further acquaintance with the customs and habits of the Hindus would enable him to correct many parts of the M.S. and to add new information on the very curious and interesting subjects on which it treats. I have now the honour of submitting to the Board. The reply of the Abbe' Dubois to a reference which I made to him on this subject, and it will thence be perceived that, not with standing the very favourable manner in which the accuracy of the facts stated in the M.S. has been mentioned by coloured wilks, the author admits that the work requires considerable alterations' and 'many additions' and that "there are chapters which ought to be entirely made again." తర్వాత ఈ వ్రాత ప్రతిని సవరించమని 1815లో A. D. Campbell రచయితను కోరినాడు. ఇద్దరి మధ్య చాలా ఉత్తరప్రత్యుత్తరాలు నడిచినాయి. పూర్తిగా ఈ వ్రాత ప్రతిని మార్చి పెంచి Abbe' Dubois సవరించినాడు. మద్రాస్ సెంట్ జార్జ్ ఫోర్ట్‌కు పంపిన ప్రతి పూర్తిగా సవరించిన ప్రతి. ఈ ప్రతి కాపీ ఇంగ్లండ్ పంపేసరికి అప్పటికే గతంలో పంపిన ప్రతి ఆంగ్లంలోకి అనువదింపబడింది. తిరిగి ఈ ప్రతిని మూడు సంవత్సరాల తర్వాత ఇండియాను ఒదిలి వెళ్ళేముందు Abbe Dubois కొన్ని మార్పులు చేర్పులు చేసినారు. ఒక ప్రతిని తనతోపాటు ఫ్రాన్స్‌కు తీసుకువెళ్ళి అక్కడ ఫ్రెంచ్ భాషలో ప్రచురించినాడు. ఇలా మార్పులు చేర్పులు చేసిన ప్రతిని 1897లో Henry K. Beauchamp అనువదించినాడు. Abbe' Dubois ఈ గ్రంథంలో మార్పులు చేర్పులు చేస్తున్నప్పుడు గతంలో Nicolas Jaques Desvaulx అనునతను రాసిన వ్రాత ప్రతుల నుండి పూర్తిగా ఎత్తి రాసినట్లు

తరువాత జరిగిన పరిశోధనలవల్ల తెలుస్తుంది. ముఖ్యంగా Sylvia Murr అను ఫ్రెంచ్ యువతి N.J. Desvaulx (1745-1825) veritable auteur des "Moeurs, institutions et ceremonies des peupes de l'Inde" de l'Abbe Dubois, అను పేరున ప్రచురింపబడిన తన పరిశోధనా గ్రంథంలో వివరించింది. ఇదే విషయాన్ని సి.పి. బ్రౌన్ తాను రాసిన Carnatic Chronology, London 1863. గ్రంథంలో వివరిస్తూ 'On Some Fraudulent Documents : 'Dubois was an ignorant man. The respectable chapters in his description of India are copied from Sonneret without acknowledgement.

Abbe Dubois కంటె ముందు ఫ్రెంచ్ మిషనరీలు తెలుగులో కొంత కృషి చేసినారు. Abbe Dubois తెలుగు కంటె తమిళంలోనే ఎక్కువ కృషి చేసినారు. ఫ్రెంచివారు మొదట తెలుగు నిఘంటువు నిర్మాణం చేసినట్లు సి.పి. బ్రౌన్ తెలియజేసినారు. ఆ కృషి 1700 ప్రాంతంలో జరిగింది. ఆ విషయాన్ని గూర్చి " The French Missionaries who laboured about A.D. 1700 wrote a French - Tamil Dictionary and another lexicon Telugu and French, (of which the title is Dictionnaire Telongou ou Badaga) filling a folio manuscript volume. It was finely written in a minute French hand but not always easy, to decipher. The authors have not given their names; I observe that they were indefatigable in recording the colloquial dialect alone. I never saw this work until I returned to England in 1855. It supplied more than a thousand phrases."

ఫ్రెంచ్‌వారు తెలుగు ప్రాంతంలో క్రైస్తవ మత ప్రచారానికి వచ్చి 'సొసైటి ఆఫ్ జీసస్' అనే సంస్థను స్థాపించి 17వ శతాబ్దపు ఆరంభంలోనే క్రైస్తవ మత ప్రచారాన్ని ఆరంభించారు. ఆ సంస్థ ప్రచారకులను 'జెసూట్లు' అని పిలిచేవారు. వారు మాత్రం రోమాపురం బ్రాహ్మణులమని చెప్పుకున్నారు. మొట్టమొదట 1610లో Roberto-de Nobili (1577-1660) అనునతను తత్త్వబోధ స్వామి పేరుతో క్రైస్తవ మిషన్ స్థాపించి తెలుగు, తమిళ భాషల్లో కృషి చేసినారు. డీలా ఫాంటైన్ అను క్రైస్తవ మత ప్రచారకుడు జ్ఞానబోధ స్వాములవారు చిత్తూరు జిల్లాలో ప్రచారం చేసి, 1701లో పుంగనూరునందు చర్చి నిర్మించారు. 1718లో అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా కృష్ణాపురంలో మరియొక చర్చిని నిర్మించారు. కృష్ణాపురంలో ఎటియెన్ని లీ-గాక్ అను క్రైస్తవ మత ప్రచారకుడు సంజీవనాథ స్వామి అను పేరు పెట్టుకొని మదిగుబ్బలో తుమ్మా అను ఇంటిపేరుగల రెడ్డి కుటుంబాల వారిని క్రైస్తవ మతంలోకి 1715లో మార్చినాడు. వీరు ఈ ప్రాంతంలో క్రైస్తవ మత ప్రచారంతో పాటు ఇక్కడ లభ్యమయ్యే తెలుగు గ్రంథాలను సేకరించి ఫ్రాన్స్‌లోని లూయి-XV గ్రంథాలయానికి పంపించేవారు. అలా సేకరించిన తెలుగు గ్రంథాలలో వేమన పద్యాల తాళపత్ర ప్రతి ఒకటి 1730వ సంవత్సరంలో ఫ్రాన్స్‌లోని లూయి-XV గ్రంథాలయానికి లీ-గాక్ ద్వారా చేరింది. ఈ తాళపత్ర ప్రతిలో 368 వేమన పద్యాలు మాత్రమే కలవు. Abbe Dubois మొట్టమొదట వేమనను గూర్చి ఆ గ్రంథాలయములోని తాళపత్ర ప్రతిని "Hindu Manners, Customs and Ceremonies" అను గ్రంథమును సవరిస్తున్నప్పుడు చూసి ఉండవచ్చు. Nicolas Jaques Desvaulx రాసినటువంటి లిఖిత ప్రతులను Abbe Dubois లూయీ-XV గ్రంథాలయంనుండే ఎత్తి రాయటం జరిగింది. అందువల్లనే తన గ్రంథంలో "His (Vemana) writings, from which I have seen several extracts, appear to me to be most interesting, and are distinguished by much discernment and independence" అని వ్రాసి ఉండవచ్చు.

సి.పి. బ్రౌన్ దృష్టికి వేమన ఎలా వచ్చింది పరిశీలించాలి.

*(ఇంకావుంది)*

# జన్యువు

- జూకంటి జగన్నాథం

మానేరు ఇవతలి ఒడ్డుకు నిలబడి గట్టిగా కీకేస్తే' అవతలి గడ్డకు వున్న మా ఊరుకు వినిపిస్తది. ఒకప్పుడు ఆవలి ఒడ్డున వున్న సిరిసిల్ల ఈవలి గడ్డనున్న మా ఊరు తంగళ్ళపల్లి. తింపి తింపి కొడితే పట్టుమని కిలోమీటర్ దూరంలేని మా ఊరు నుంచి నేను సిరిసిల్లకు మారిన 'తీరాల' తీరు తీరొక్కగా తారుమారైంది. విషయం వెతుక్కుంటూ పోతే ఈ రోజు ఉద్యోగం పిల్లల చదువు సౌకర్యాలు ఇత్యాది కారణాలు నెపాలుగా కనిపిస్తున్నాయి.

మళ్లీ ఇవతలి నుంచి లగాయించి కీకేస్తే మానేరు అవతలనున్న మా ఊరుకు వినబడుతుంది. కానీ ఆ పిలుపును అందుకోవడానికి మా ఊరేకాదు ఏ ఊరు తయారుగా లేదు. పోనీ మా అమ్మ అన్నదమ్ములు, అక్కాచెల్లెండ్లు, సోపతిగాళ్ళు, కులపోళ్ల తలపోళ్లు, సబ్బండ వర్ణాలు ఎవరూ వినవచ్చినా బదులు పలుకరు. పలికినా ఆ ఆత్మీయతా తడి ఆనవాలు మచ్చుకు కనిపించదు. - "ఓ" అంటే 'ఓహో' అనుడే - వంతుకు దాసరి కాలు ఆడిచ్చినట్టుగా వుంటుంది. ఎందుకిలా జరిగింది- జరుగుతుంది - కుదిపేస్తున్న విషాదం విధ్వంసం భీభత్సం 'బుదుగరించి' దగ్గరికి తీసుకుంటే ఊరు నా మీదపడి వలవలా ఏడ్చేలాగుంది.

కొంచెం ముందుగా మానేరు గురించి వివరిస్తాను- ఒకప్పుడు 'సుడి' మీదుండి రేపు మాపు ఈనుతుందనగా కూడా పాలు యిచ్చే అపురూప అరుదైన జాతి 'పాడి బర్రె'లా మానేరు సంవత్సరమంతా పారేది - ఎక్కడ కొంచెం 'ఉసికె'ను తీసినా నీళ్ల తన్నుకువచ్చి చెలమలా దోసిలెత్తేది. లంగా ఓణీ వేసుకు మంచినీళ్ల బిందెను మోసే పడుచులా వుండేది. నిండా చీర జాకెట్టుతో నడిచే యువతిలా ఉండేది. మానేరు గోదావరిలో కలిసే వరకు ఎన్ని వందల ఊర్లను ఎన్ని లక్షల మందిని తన స్పర్శతో పచ్చగా పునీతం చేసేది.

ఎవరైనా ఎప్పుడైనా కాళ్లు తడువకుండా దాటని మానేరు మీద తరువాత్తరువాత వంతెన కట్టారు. విచిత్రమేమంటే 'పూల్' ఎప్పుడైతే వచ్చిందో అప్పటి నుండి దాదాపు మానేరు వాగు కన్నుమూతకు దగ్గరైంది. వంతెన నిండి, వాగు ఎండి రెండూ ఒక్కసారి కూడబలుక్కు వచ్చినట్లైంది. లేకుంటే మానేరు పారుకం బొత్తిలకు బందై పోయేదా మరి- వంతెన మీద తెల్లందాకా పొద్దుందాక నడుసుడు షురూవైంది. మనుషులు పట్టణాల తొవ్వపట్టారు. మానేరు కండ్లల్ల కొనూపిరి వుంచుకు లారీ మీదకు ఎక్కించి డొక్క లోపలికి పోయిన బర్రె గోసగా 'కోత' దారి పట్టింది. ఇప్పుడు మానేరు అంటే పై నుంచి కొసదాకా 'ఇసుక' తరలించుకుపోయే 'దందా' అయిపోయింది.

---

జూకంటి జగన్నాథం, ప్రముఖ కవి, రచయిత, సిరిసిల్ల.

1974 ప్రాంతంలో పత్రికల్లో దేశానికి 2000 సంవత్సరం వరకు తీవ్ర మంచినీటి కరువు రానుందంటే చుట్టూ వున్న అపార జలరాశిని చూసి ఎట్టి పరిస్థితిలో నీటి కటకట రాదనుకున్నాను.

పెద్దగా కొత్త విషయంగా మీకు అనిపించకున్నా భారతదేశ 57 సంవత్సరాల నల్లదొరల పాలనవల్ల 'ఎవుసం' మూలకు వడ్డది. చితికిపోగానే వ్యవసాయ రంగం చుట్టూ గ్రామంలో వివిధ కులాలకు పనిదొరికే తనం పూర్తిగా పోయింది. అదిగో అక్కడే మొదలైంది రచయితలకు చిక్కు సమస్య-అవసరం.

ప్రాథమికంగా కవినైనా నేను కథా సాహిత్యాన్ని విస్తృతంగా చదివేవాన్ని - కదిలిన ప్రతిసారీ లోపల్లోపల కుమిలిపోయేవాన్ని - కవిత్వంలో ఇముడని లేక న్యాయం జరగని అనేక అంశాల్ని కథలుగా రాసాను- ఓ డజను కథలు రాసిన క్రమంలో ఆయా మనుషుల అనేకానేక అనుభవాలు ముచ్చట్లు దుఃఖాలు గుండె కలుక్కుమనే బాధలు ఉన్నాయి. ప్రాంతం భాషా సంస్కృతి మట్టిలపై మొదటి నుండి సాధికారికమైన పట్టుతో రచనలు చేసాను.

ప్రతికథా వస్తువులోని పాత్రలునన్ను వెంటాడి వేటాడి ప్రశ్నించి నిలదీసి నిలువలేక నన్ను కథలు రాసేవైపు పురికొల్పాయి. అందుకే ప్రతి కథలో 'నా గుండె పగిలిన కన్నీటి చారలు ముడితే కనిపిస్తాయి. నాకు ఒక్కటి మాత్రం తెలుసు తడి ఆనవాలున్న ప్రతి కథా నా దగ్గరకు చాలా మంది కొత్త మిత్రులను మోసుకొచ్చింది.

కేవలం నా కథల ద్వారా ప్రజల వేదనలకు సాహిత్యానికి నడుమ మధ్యవర్తిలానే మమేకమైన పరిణామంలోనే నేను కథకునిగా ఒదిగిపోయి ఎదిగాను.

నా ముప్పైఏళ్ల సాహిత్య ప్రయాణంలో మంచి కథల పట్ల కొన్ని స్పష్టమైన ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఏ కథకుడైనా తను ఎన్నికచేసుకున్న పరిశీలించిన వస్తువుకు కథా రూపం ఇచ్చేటప్పుడు మానవ ఆకారంగా కొన్ని బొక్కలను పేర్చి వాటికి రక్త మాంసాలను గుండెను ఇచ్చి జీవం పోయగానే అడుగులు వేస్తున్న 'కథ' మంచి కథకు ముగింపు అయ్యిపోవాలనుకుంటాను.

దళిత రచయితలుగాని, స్త్రీవాద రచయితలుగాని, విప్లవ రచయితలుగాని తమ తమ అభిప్రాయాలకు అనుగుణంగా కథలు నడిపితే అవి అస్థిపంజరాల్లా మిగిలిపోయి వెక్కిరిస్తాయి. ఆయా ఉద్యమాలు ఊపుమీద వున్నప్పుడు రాణించి ఆ తరువాత చట్టన చల్లారిపోతాయనిపిస్తుంది. అందుకే జీవితంలో ఒక భాగంగా ఒక కొనసాగింపులో ఎదురయ్యే అనేకానేక ఆటుపోట్లన్నీ మానవ సంబంధాల సంక్లిష్టతల్ని కథలోకి గైకొనివచ్చినప్పుడే కొంతమందినైనా ఆలోచింప

చేస్తాయనుకుంటాను. అందుకే అనేక ఉద్యమ కథల్లో ఉత్పత్తి అయిన సాహిత్యం 'వైకల్యం' ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. నిజాయితీ పరిశీలన రాజీ పడనితనమే ఏ రచయితకైనా జీవగర్ర.

ఇదంతా ఒకవైపైతే మరోవైపు అన్ని ఊర్లతో పాటు మా ఊరుకూడా చెరువు, చేదబాయిలు, ఎండిపోయి బోరింగులను నల్లా నీళ్లను ఆశ్రయించింది. క్రమక్రమంగా అన్ని కులవృత్తుల జీవనం పోయి ఒక 'కార్పోరేట్ కల్చర్'గా రూపెత్తింది. ఇయ్యాల్ల దేశం చౌరస్తాలో 'ఊరు' 'కూలీ'గా కూలీ కొరకు శ్రమ అగ్గువకు అమ్ముకునేందుకు దీనంగా నిలబడింది. మా ఊరికి పాఠశాలతో పాటు వంతెన, కరెంటు, శ్మశానవాటిక, డిస్‌కనెక్షన్‌లు, బ్రాందీ షాపులు, గుడి, డబుల్ తార్రోడ్డు వచ్చాయి. కానీ మనుషుల్లో వెలుగు అంతర్ధానమైంది. మనుషులు మనుషుల్లాలేరు. దివాలా తీసినట్టున్నారు. మానవ సంబంధాల పతనం వైపు ముందెప్పుడూ లేనంత వేగంగా జరిగిపోతున్నారు. అప్పుడప్పుడూ ఒరిగిపోతున్నారు. ప్రపంచ ఏకధృవ గ్రామాన్ని ఛానల్స్ చెదల్లా తినేస్తున్నాయి.

ఊరి మధ్యనున్న మల్లమ్మ, మణెమ్మ హోటళ్లుపోయి రోడ్డుకు ఆసరా చేసుకొని ఉడిపి హోటళ్లు వచ్చాయి. 'అస్సలు ఊరు' పాడుబడి రోడ్డుప్రక్కన కొత్త ఇండ్లు వరుసగా 'మార్కెట్టు' మాటకారి తనాన్ని పుణికిచ్చుకుంది. నా చిన్నతనంలో ఊరకాలువ దగ్గరున్న 'జన్నీదు' కింద ఐదువందల రూపాయల అప్పుకు ఎలుకల మందు తాగి బల్మిటికి సచ్చిపోయిన 'బుడ్డీసు లచ్చయ్య' నుంచి ఈ రోజు రైతులు, నేత కార్మికులు, విద్యార్థులు, స్త్రీలు బతుకు కన్నా 'అల్క'గా మరణాన్ని ఆలింగనం చేసుకుంటున్న అత్యంత విషాద విహ్వల సన్నివేశాలు నా నేపథ్యం.

నా జీవధాతువు మా అమ్మమ్మ తల్లిగారి ఊరైన బచ్చన్నపేటలో లేదనిపిస్తుంది. నా సెకండ్రీ చదువు కొనసాగిన అమ్మమ్మ ఊరిలో కన్పించదు. మా తాతల తండ్రుల తల్లుల లోపల అగుపించదు. చుట్టూ జనం వేదనల్లో కన్నీళ్లలో దయలో దుర్మార్గంలో తలవంచుకునే తనం గాక తలెత్తుకునే తనంలో పుట్టుక చలనంలో నాలోని కథకుని జెనోమ్ రహస్యం దాగి ఉందని నిక్కచ్చిగా అనిపిస్తుంది.

మళ్లీ నా నివాసాల్లోకి వస్తాను- సిరిసిల్లను రోజుకో ఆకలి చావు కుదిపేస్తుంది. హైవేను కలిపే డాంబరు రోడ్లు నల్లత్రాచు పామై మా ఊరును కాటేసింది. మా ఊరిలో వెలసిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మాత్రం A.S.V. (Anti Snake Venom) మందులేదు. అంతకు మిక్కిలి రక్షించాలనే మనసూ లేదు. ఈ స్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేని మోసకారి రాజ్యం 'ఊం తడి'తో కన్నీళ్ళు పెట్టుకుంది.

అగ్గి అగ్గోల జెరం వచ్చిన యాల్ల.





అందరికీ అందుబాటులో ఉండేలా తయారయిన ఒక అందమైన అచ్చు ప్రతి. ఖరీదు తక్కువ కావటము వలన సామాన్యునికి అందుబాటులోకి వచ్చిన కళామూర్తులివి. జపాన్, జవా దేశస్థుల నీటి వర్ణచిత్రాలు ఐరోపా దేశస్థుల కళను ఎంతగా ప్రభావం చేశాయో దీని నుండి తెలుసుకోవచ్చు.

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2003-05



1900వ సం॥లో ఫ్లెమెండ్ కంచును పూలకుండీలా మలచి
దానిపై అందమైన శిల్పంచెక్కి బంగారు పూతపూయబడింది